ఆత్మవిశ్వాసం అండగా..!

పసి వయసులో పోలియో... ఆమె కాలు కదలనివ్వలేదు. కానీ పట్టుదలతో చదివి... ఆత్మవిశ్వాసంతో నిలబడింది. నేడు తనలాంటి ఎంతోమందికి దిక్సూచిగా మారి... ఆత్మస్థైర్యం నింపి... ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. సామాజిక కార్యకర్తగా, రచయిత్రిగా, అథ్లెట్‌గా... ఎన్నో హృదయాలను గెలుచుకున్న అమితా పటేల్ విజయ గాథ ఇది.



"కష్టాలు అందరికీ వస్తాయి. సవాళ్లు ఎదురవుతాయి. వాటిని అధిగమించి ముందుకు సాగితేనే జీవితం. ఇది నాకు చిన్నప్పుడే బోధపడింది. అందుకు కారణం నా వైకల్యం. నాకు ఏడాదిన్నరప్పుడు పోలియో మహమ్మారి సోకిందని వైద్యులు నిర్ధారించారు. ఇక అప్పటి నుంచి మా అమ్మానాన్నలకు కంటి మీద కునుకులేదు. అలాగని వారు బాధపడుతూ... నన్ను బాధ పెట్టలేదు. వైకల్యాన్ని మరిచిపోయేలా నాకంటూ ఒక మెరుగైన జీవితం ఇవ్వాలనుకున్నారు. దానికి తగ్గట్టుగానే నన్ను ఎంతో అపురూపంగా పెంచారు. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ సమీపంలోని జోద్‌పూర్ మా ఊరు. ఊహ తెలిసినప్పటి నుంచీ వైకల్యంతో పోరాడుతున్నాను. దీనివల్ల ఎన్నో ఇబ్బందులు, అవహేళనలు. అన్నిటినీ తట్టుకొని నిలబడ్డానంటే అందుకు మా అమ్మానాన్నల ప్రేమ, మార్గదర్శనం, ప్రోత్సాహం కారణం.

బడికి వెళ్లలేక...

నా పరిస్థితి ఏంటో నాకు బాల్యంలోనే అర్థమైంది. చక్రాల కుర్చీ లేనిదే అడుగు బయటకు పెట్టలేను. ఈ వైకల్యాన్ని జయించాలంటే నన్ను నేను నిరూపించుకోవాలి. నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి. వీటన్నిటికీ పునాది విద్య ఒక్కటేనని అమ్మానాన్నలు చెప్పారు. వారి అండతో ఉన్నత చదువులు చదవాలని కలలు కన్నాను. కానీ బడికి వెళ్లడమే గగనమైపోయింది. కష్టపడి వెళ్లినా... తరగతి గదుల్లో కూర్చోవడం, తిరిగి బయటకు రావడం... ఇలా ప్రతిదీ సమస్యగానే మారింది. పాఠశాలల్లో నాలాంటి వికలాంగులకు ఎక్కడికైనా వీల్‌చైర్‌లో వెళ్లగలిగేలా సరైన సౌకర్యాలు ఉండేవి కావు. మరి నా చదువుకు మార్గం ఏమిటి? ఈ ఆలోచన మా ఇంట్లోవాళ్లను కొన్నాళ్లు సందిగ్ధంలో పడేసింది. అయితే నా ప్రతిభాపాటవాల మీద వాళ్లకు ఎంతో నమ్మకం. చివరకు స్థానిక గ్రామ పంచాయత్ స్కూల్లో చేరాను.

భవిష్యత్తుకు పునాది...

చదువుకోవాలన్న నా దృఢ సంకల్పానికి, నా భవిష్యత్తుకు, నాపై అమ్మానాన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడానికి ఆ పాఠశాలలోనే పునాది పడింది. క్రమంగా పదో తరగతి, హెచ్ఎస్‌సీ, బీఏ, ఆ తరువాత ఎల్ఎల్‌బీ



పూర్తి చేశాను. నా విద్యాభ్యాసంలో ప్రతి మైలు రాయినీ ఎనలేని అంకితభావంతో అధిగమించాను. అదే సమయంలో నాలాంటివారికి అండగా నిలబడి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని నిర్ణయించుకున్నాను. దాంతో పాటు సామాజిక అంశాల మీద కూడా పరిజ్ఞానం పెంచుకున్నాను.

ప్రతిచోటా తిరస్కరణలే...

మొదటి నుంచి నా కాళ్లపై నేను నిలబడాలన్న తపన. అందుకే చదువు అవ్వగానే అమ్మానాన్నకు భారం కాకుండా మంచి ఉద్యోగంలో స్థిరపడాలనుకున్నాను. వృత్తి విద్య, కంప్యూటర్ కోర్సులు చాలా నేర్చుకున్నాను. నా వైకల్యం వల్ల కార్పొరేట్ కంపెనీల నుంచి తిరస్కరణలే ఎదురైంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తే... వ్యవస్థీకృత అడ్డంకులు ఎదురయ్యాయి. ఇక్కడే నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఉద్యోగ ప్రయత్నాలకు మార్గం మూసుకుపోవడంతో సొంత వ్యాపారం ప్రారంభించాలని అనుకున్నాను.

సరికొత్త అధ్యాయం...

ఈ నేపథ్యంలోనే 1992లో నా జీవితంలో ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలికాను. కంప్యూటర్ కోర్సులు నేర్పే ఇనిస్టిట్యూట్ ఒకటి నెలకొల్పాను. అది కూడా మా ఇంట్లోని ఒక గదిలో. వైకల్యం ఉన్నవారితో పాటు ఏ ఆధారం లేని యువతను సాధికారత దిశగా నడిపించాడానికి అది నేను వేసిన తొలి అడుగు. కేవలం కంప్యూటర్ విద్య మాత్రమే కాకుండా... వారిలో ఆత్మవిశ్వాసం నింపి, భవితకు భరోసా కల్పించేందుకు ప్రాధాన్యం ఇచ్చాను. వికలాంగులకు ఉచిత విద్య అందిస్తున్నాను. దాంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నాను. ముఖ్యంగా నాలాంటివారికి పెళ్లిళ్లు అవ్వడం చాలా కష్టం. అందుకే... నా దగ్గరకు విద్య అభ్యసించే అలాంటి విద్యార్థుల పెళ్లి బాధ్యత కూడా నేనే తీసుకున్నాను. 'దివ్యాంగ్ రోజ్‌గార్ మేళా, దివ్యాంగ్ జీవన్‌సాథీ' లాంటి కార్యక్రమాలు నిర్వహించి వారికి మంచి జీవితాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాను.

వారి గుండెల్లో నేను...

నా కృషివల్ల ఇన్నేళ్లుగా వేలమంది ప్రయోజనం పొందారు. అనేకమంది బాగా స్థిరపడ్డారు. అన్నిటికీ మించి వారి గుండెల్లో నాకు స్థానం ఇచ్చారు. నాకు... నా విద్యార్థులకు మధ్యనున్నది భావోద్వేగాల బంధం. ఇంతకు మించిన సంతృప్తి నాకు ఎక్కడ దొరుకుతుంది! సామాజిక కార్యకర్తగానే కాకుండా... నాకంటూ ఒక జీవితం ఉంది. నేను మంచి అథ్లెట్‌ను కూడా. జావెలిన్ త్రోలో చాలా పతకాలు సాధించాను. కవిత్వం రాస్తాను. మన సామర్థ్యానికి, వేరొకరికి స్ఫూర్తిగా నిలవడానికి వైకల్యం అనేది అవరోధం కాదని ఈ సమాజానికి నిరూపించడమే నా ఏకైక లక్ష్యం. అందులో కొంతవరకు విజయం సాధించాని గర్వంగా చెప్పగలను."



వివాదాలు చుట్టుముట్టినా, వైఫల్యాలు ఎదురైనా... 'తగ్గేదిలే' అనే స్వభావం మీసా భారతి సొంతం. తెరవెనుక రాజకీయ వ్యవహారాల్లో చాతుర్యం, ముక్కు మీద కోపం... ఇవీ ఆమె గురించి వినిపించే విశేషణాలు. పాటలీపుత్ర నుంచి మూడోసారి పోటీకి దిగిన లాలూగారి పెద్దమ్మాయి... ప్రధాని మోదీని జైల్లో పెట్టిస్తామంటూ చేసిన వ్యాఖ్యలు బిహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించాయి.

పంతం కోసం ఎందాకైనా...

"రామ్ కృపాల్ యాదవ్ అంటే మాకు ఎంతో గౌరవం ఉండేది. కానీ మమ్మల్ని మోసం చేసి బిజెపిలో చేరారు. ఆ సంగతి తెలియగానే... గడ్డిని ముక్కలు చేసే యంత్రంతో అతని చేతులు నరికెయ్యాలనుకున్నాను. నాకు ఎదురుపడితే అదే చేసేదాన్ని..." 2014 లోక్ సభ ఎన్నికల ప్రచారంలో మీసా భారతి ఆగ్రహంతో అన్న మాటలివి. ఆమె తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు రామ్ కృపాల్ కుడి భుజం. లాలూ పార్టీ అయిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) తరఫున పట్నా నుంచి ఎంపీగా కూడా గెలిచారు. కానీ 2009లో పట్నా నుంచి లాలూ స్వయంగా పోటీ చేయడంతో... రామ్ కృపాల్‌కు అవకాశం దక్కలేదు. 2014లో తనకు పాటలీపుత్ర పార్లమెంట్ సీటు ఇవ్వాలని లాలూను ఆయన కోరారు. కానీ అప్పటికే ఆ స్థానం మీద లాలూ తొలి సంతానమైన మీసా భారతి కన్నుపడింది. ఎందుకంటే... ఆమె భర్త శైలేష్ సొంత ఊరు దామాపూర్. అది పాటలీపుత్ర పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఉంది. చివరకు ఆమెనే అభ్యర్థిగా లాలూ ప్రకటించారు. దాంతో ఆర్‌జెడికి రామ్ కృపాల్ రాజీనామా చేసి, బిజెపిలో చేరారు. మీసాను ఓడించారు. కేంద్ర మంత్రి అయ్యారు. 2019 ఎన్నికల్లోనూ రామ్ కృపాల్ చేతిలో మీసా ఓటమి పాలయ్యారు. ఈ పరాజయాలను మీసా చాలా వ్యక్తిగతంగా తీసుకున్నారని చెబుతారు ఆమె సన్నిహితులు. పార్టీకి కంచుకోటల్లాంటి వేరే స్థానాలేవైనా ఎంచుకొనే వెసులుబాటు ఆమెకు ఉంది. అదీగాక... రెండు విడతలుగా రాజ్యసభ సభ్యురాలుగా కూడా ఆమె కొనసాగుతున్నారు. ఎంపీగా ఆమె హోదాకు ఎలాంటి ఢోకా లేదు. అయితే "ఎప్పటికైనా రామ్ కృపాల్‌ను ఓడించి తీరుతాను" అని మీసా పంతం పట్టారు. అందుకే ఈసారి కూడా పాటలీపుత్ర నుంచి... రామ్ కృపాల్‌కు ప్రత్యర్థిగా ఆమె బరిలోకి దిగారు. ఇటీవలే ఆ పార్లమెంటరీ స్థానానికి పోలింగ్ ముగిసింది. ఈ విడత ప్రచారంలో మీసా తన వ్యాఖ్యలకు మరింత పదును పెట్టారు. ప్రధానమంత్రి మోదీపై విపక్షాలు ఎన్నో విమర్శలు చేస్తూ ఉండొచ్చు. కానీ "మా కూటమి అధికారంలోకి వస్తే మోదీతో సహా బీజేపీ నాయకులందర్నీ జైల్లో పెట్టిస్తాం" అనే ధైర్యం చేసింది బహుశా మీసాయే కావచ్చు. ఆమె వ్యాఖ్యలపై బిజెపి వర్గాలు తీవ్రంగా విరుచుకుపడ్డాయి. దాంతో తన మాటలకు ఆమె వివరణ ఇస్తూ "ఎలక్టోరల్ బాండ్స్ గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మీదే నేను మాట్లాడాను. మా ప్రభుత్వం వస్తే వాటి మీద విచారణ జరిపించి, దోషులకు శిక్ష వేయిస్తామన్నాను. నా మాటలు వక్రీకరించారు" అంటూ సమర్థించుకున్నారు.

హార్వర్డ్ వివాదం...

మాటలతో, చేతలతో వివాదాల్ని కొనితెచ్చుకోవడం మీసాకు కొత్తేం కాదు. 2015 మార్చిలో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఇండియన్ కాన్ఫరెన్స్‌లో తాను ప్రసంగించానని సూచించే కొన్ని ఫొటోలను ఫేస్‌బుక్‌లో, ట్విట్టర్‌లో మీసా భారతి పెట్టారు. వాటిని బిహార్‌లోని వార్తాపత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. దీని గురించి హార్వర్డ్ విశ్వవిద్యాలయం వర్గాలను జాతీయ మీడియా వాకబు చేసినప్పుడు... "మీసా భారతి ఇండియా కాన్ఫరెన్స్‌లోని ఏ ప్యానెల్‌లోనూ వక్త కాదు. ఆమె ప్రేక్షకురాలుగా, టిక్కెట్టు కొనుక్కొని హాజరయ్యారు" అని ఇ-మెయిల్ ద్వారా స్పష్టం చేశారు. ఆమె తన సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు అప్‌లోడ్ చేశారనీ, అవి తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయనీ, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామనీ తెలిపారు. దరిమిలా... తప్పుడు సమాచారంతో మీసా భారతి ప్రజలను మోసం చేశారంటూ బీజేపీ నాయకుడొకరు ముజఫర్‌నగర్ కోర్టులో కేసు వేశారు. దాంతో మీసా నష్టనివారణ చర్యలకు దిగారు. "హార్వర్డ్ వర్సిటీలో జరిగిన ఇండియన్ కాన్ఫరెన్స్‌కు వెళ్లాను. పోడియం దగ్గర కొన్ని ఫొటోలు తీసుకున్నాను. నా స్నేహితులకు షేర్ చేశాను. వాటిని స్థానిక మీడియా సంపాదించి, దాని చుట్టూ కథ అల్లింది. నేను ప్యానల్‌లో ఉన్నానని ఎప్పుడూ చెప్పలేదు. సదస్సు తరువాత... ప్యానలిస్టులతో నా అభిప్రాయాలను వ్యక్తిగతంగా పంచుకున్నానంతే. ఎవరో ఔత్సాహికులు, అభిమానులు నేను వక్తనంటూ వాటిని సర్క్యులేట్ చేసి ఉంటారు. ఈ వ్యవహారం నా దృష్టికి రాగానే... వాటిని తొలగించేలా చేశాను. తప్పుడు ప్రచారాన్ని నేను ఎప్పుడూ కోరుకోలేదు. నా మీద అక్కసుతో కొందరు చేస్తున్న ఆరోపణలు ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి" అంటూ ఎదురుదాడికి దిగారు.

అమ్మ వెనుక చక్రం తిప్పి..

"మీసా చాలా కోపిష్టి. అనుకున్నది జరగాలంటుంది. ఎవరి మీదైనా కోపం పెంచుకుంటే... వారి అంతు చూడాల్సిందే" అని ప్రైవేటు సంభాషణల్లో ఆమె మేనమామ సాధుయాదవ్ వాపోయారనే కథ ఒకటి ప్రచారంలో ఉంది. నాడు దాణా కుంభకోణం కేసు నేపథ్యంలో... బిహార్ ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేయడంతో... ఆ బాధ్యతలను ఆయన భార్య రబ్రీదేవి చేపట్టారు. మూడు విడతలుగా ఆమె సీఎం పదవిని నిర్వహించిన కాలంలో... పాలనా వ్యవహారాలన్నీ మీసాభారతి చేతుల మీదుగానే సాగాయి. అమ్మ వెనుక ఆమె చక్రం తిప్పి, అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో... తన తల్లి రబ్రీని కలుసుకోడానికి కూడా మేనమామ సాధు యాదవ్‌ను మీసా అనుమతించలేదు. ఆ తరువాత సాధు యాదవ్ ఆర్జేడీని విడిచిపెట్టాల్సి వచ్చింది. మీసా మీద, ఆమె భర్త మీద బినామీ ఆస్తులు, మనీ ల్యాండరింగ్, లెక్కచూపని ఆస్తులకి సంబంధించి అనేక ఆరోపణలున్నాయి. ఈడీ దర్యాప్తులు, ఆస్తులపై దాడులు, కీలకమైన పత్రాల స్వాధీనం లాంటివి జరిగాయి. "ఇలాంటి వాటికి బెదిరేది లేదు. ఇదంతా కుట్ర" అంటారు మీసా. లాలూ సీఎంగా ఉండగా... ఆమెకు అర్హత లేకపోయినా ఎంబిబిఎస్ సీటును పొందారంటూ అప్పట్లో విపక్షాలు గగ్గోలుపెట్టాయి. తను చదివిన పాట్నా మెడికల్ కాలేజీ అండ్



హాస్పిటల్ (పిఎంసిహెచ్)లో... గైనకాలజీలో టాపర్‌గా ఆమె నిలవడం, ఇన్ని విమర్శల మధ్య డాక్టర్ చదువు పూర్తి చేసినా... ఎప్పుడూ ప్రాక్టీస్ చేయకపోవడం... ఇలా ప్రతిదీ చర్చనీయాంశమే అయింది. వీటన్నిటినీ ఆమె కొట్టిపారేస్తారు. "నా పేరే ఒక అణచివేతపై ధిక్కారానికి ప్రతీక" అంటారామె. ఎమర్జెన్సీ సమయంలో... 'అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం' (మీసా) కింద లాలూ ప్రసాద్ అరెస్టయ్యారు. సుమారు రెండేళ్ళు జైల్లో ఉన్నారు. ఆ సమయంలో... 1976 మేలో జన్మించిన తన పెద్ద కుమార్తెకు... మీసా చట్టం కింద దేశంలో జరిగిన అణచివేతకు గుర్తుగా 'మీసా భారతి' అని పేరు పెట్టారు. కాగా... లాలూ-రబ్రీ హయాంలో బిహార్‌లో ఆటవిక పాలన నడిచిందనీ, పేదలు, వెనుకబడ్డ వర్గాలవారు, ఓబీసీల మీద అత్యాచారాలు, అణచివేతలు తీవ్రంగా సాగాయనీ విపక్షాల ఆరోపణ. దీనికి పరోక్షంగానైనా మీసా భారతి మద్దతు ఉందనే వాదనా ఉంది. ఒక అణచివేతపై ధిక్కారానికి చిహ్నంగా చెప్పుకొనే వ్యక్తే... మరో అణచివేతకు దోహదం చేయడం... మీసా కథలోని రాజకీయ వైచిత్రి.

ఆనందమే ఆరోగ్యం!

ఇపుడున్న పోటీ ప్రపంచంలో ఆనందం వెతుక్కున్నా దొరకనిది అయ్యింది. అయితే రొటీన్‌కి భిన్నంగా కాస్త ఆలోచిస్తే ఆనందం దొరక్కపోదు. ముఖ్యంగా ఆనందంగా ఉండటానికి ఇలాంటి టిప్స్ పాటించండి.

- మీ చుట్టూ నెగటివ్ పీపుల్ కాకుండా పాజిటివ్‌గా ఆలోచించేవాళ్లు ఉండేట్లు చూసుకోండి. అంటే పాజిటివ్ మైండ్స్‌తో కలసి తిరగటం వల్ల మంచి అలవాట్లు, అభిరుచులు కలుగుతాయి. అలా పాజిటివ్ ఎన్విరాన్‌మెంట్‌లో ఉంటే ఒత్తిడి తగ్గుతుంది. దీనివల్ల సంతోషంగా ఉండే అవకాశాలెక్కువ.
- ఏదైనా మీరు చేసిన తప్పులను యాక్సెప్ట్ చేయండి. మీ తప్పులనే మీరు ఒప్పుకోవటం అంటే మీలోని మీరు జయించటమే. నెగటివిటీకి నీట్‌గా తుడిచేయటమే. అంతేనా ఎక్కువగా మాట్లాడకుండా ప్రశాంతంగా ఉండండి. మనసు ప్రశాంతంగా ఉంటే మీరూ సంతోషంగా ఉండగలరు.
- మంచి ఆహారం తినటం, వ్యాయామం, చేసే పని మరింత బాగా చేయటం వల్ల ఫీల్‌గుడ్ ఉంటుంది. పర్ఫెక్ట్ డైట్ వల్ల ఎనర్జిటిక్‌గా ఉంటారు. తద్వారా మంచి నిద్ర పడుతుంది. దీనివల్ల ఆనందం కలుగుతుంది.
- ఎక్కువ సమయం మీతో మీరు గడపండి. ఏమీ పని లేకుంటే సెల్ఫ్‌కేర్ తీసుకోవాలి అంటారు. పుస్తకం చదవటం, జిమ్‌కు వెళ్లటం, ఒంటరిగా తిరగటం, విశ్రాంతి తీసుకోవటం.. లాంటివి చేయటం వల్ల మైండ్ ప్రశాంతంగా ఉంటుంది. దీంతో ఆనందం సొంతమవుతుంది.



- కంప్యూటర్ స్క్రీన్, ఫోన్‌లో ఇంటర్నెట్ చూడటం లాంటివి అధికంగా చేస్తే ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. అందుకే డిజిటల్ డిటాక్స్ చేయాలి. నెట్ సమయాన్ని తగ్గించుకుని నిజమైన ప్రపంచంలో బతకాలి. అప్పుడే ఆనందం వెల్లివిరుస్తుంది.
- ఇతరుల పట్ల దయ, జాలి, మర్యాద లాంటివి ఇవ్వటంతో పాటు క్షమించే గుణం అలవరుచుకోవటం మంచిదే. దీనివల్ల మీలో నెగటివ్ ఎమోషన్స్ తగ్గిపోతాయి. ఎనర్జిటిక్‌గా ఫీల్ అవుతారు. కొత్త వస్తువులు, కొత్త ప్రదేశాలు తిరగటం వల్ల కూడా గ్రేట్‌గా ఫీల్ అయ్యే అవకాశాలెక్కువ.

నవ్య | చిత్రజ్యోతి

వినోదం ప్రధానంగా



'బలగం, ఓం భీమ్ బుష్' చిత్రాలతో సక్సెస్‌ను అందుకొన్నారు నటుడు ప్రియదర్శి. ఇప్పుడు ఆయన హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బేనర్స్‌పై జాన్వీనారంగ్ నిర్మిస్తున్నారు. 'సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ స్టోరీలో ప్రియదర్శి పాత్ర పూర్తి స్థాయి వినోదాన్ని పంచుతుంది. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ప్రీ ప్రొడక్షన్ పూర్తి చేసి జనవరిలో సెట్స్‌పైకి తీసుకెళ్తాం. త్వరలో టైటిల్ ప్రకటిస్తాం' అని మేకర్స్ తెలిపారు.

భయపెడుతున్న అదా శర్మ

చాలా రోజుల తర్వాత హీరోయిన్ అదా శర్మ తెలుగులో ఓ సినిమా చేస్తున్నారు. ఆ చిత్రం పేరు 'సీడీ'(క్రిమినల్ ఆర్ డెవిల్). కృష్ణ అన్నం దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న ఈ సినిమాను మే 10న విడుదల చేయనున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో అదా శర్మ యాక్షన్ సీక్వెన్స్, భయపెట్టే చూపులతో ప్రేక్షకులు కచ్చితంగా థ్రిల్ ఫీలవుతారు. ట్రైలర్‌లో విజువల్స్, రీరికార్డింగ్ .. అద్భుతంగా ఉన్నాయి. విశ్వంత్, 'జబర్దస్త్' రోహిణి, భరణీశంకర్, రమణ భార్గవ్, మహేశ్ విట్టా ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మాటలు: ముద్దుకృష్ణ, సినిమాటోగ్రఫీ: సతీశ్ ముత్యాల ,సంగీతం: ఆర్.ఆర్. ధ్రువన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గిరిధర్.



బంగారంలా ఉండాలంటే...



అనారోగ్య సమస్యల కారణంగా సినిమాలకు కాసింత విరామం ఇచ్చారు సమంత. 'ఖుషీ' తర్వాత సమంత ఏ మూవీకి అంగీకరించలేదు. 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌లో నటించారు. సమంత నటించే మరో చిత్రం ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం సమంత పుట్టిన రోజు. ఈ సందర్భంగా అభిమానులకు తీపి కబురును అందిస్తూ.. తను నటించబోతున్న నెక్స్ట్ సినిమా అప్‌డేట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె షేర్ చేశారు. ఈ సినిమా టైటిల్ 'మా ఇంటి బంగారం'. "బంగారంలా ఉండాలంటే ప్రతీ వస్తువు మెరవాల్సిన పని లేదు" అని పేర్కొంటూ ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను షేర్ చేశారు సామ్. ఈ సినిమాతో ఆమె నిర్మాతగా మారుతుండటం విశేషం. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమాను ఆమె నిర్మిస్తున్నారు. ఇందులో సమంత ఓ వైలెంట్ గృహిణి పాత్రలో కనిపించనున్నట్లు ఈ మోషన్ పోస్టర్‌ను చూస్తుంటే తెలుస్తోంది.

మనసుకు హత్తుకునే అనుబంధం



సముద్రఖని ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతోన్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. ధనరాజ్ కీలకపాత్ర పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. పృథ్వీ పోలవరపు నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సముద్రఖని అన్నయ్య సహాయం లేకపోతే ఈ సినిమా చేయలేను. తండ్రీ కొడుకుల అనుబంధాన్ని మనసుకు హత్తుకునేలా ఆవిష్కరిస్తుంది ఈ చిత్రం' అన్నారు. సముద్రఖని మాట్లాడుతూ 'ధనరాజ్‌కు తల్లిదండ్రులు లేరు. సొంతంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాడు. అతనిపై నమ్మకంతో ఈ సినిమాకు దర్శకత్వం వహించమని చెప్పాను' అన్నారు. ధనరాజ్ మాట్లాడుతూ 'పిల్లలు అంతా తమ తండ్రితో కలసి చూడాల్సిన చిత్రం ఇది' అన్నారు.

ఇది బుల్లెట్ తెచ్చిన సక్సెస్



రవి వర్మ, సంజనా సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకత్వం వహించారు. ఎంసి రావు, బి గోపాల్, ఎమ్ వి మల్లికార్జున రావు, కోసూరి సుబ్రమణ్యం, మని నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. దర్శకుడు చౌడప్ప మాట్లాడుతూ "మంచి చిత్రాలను ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని ఈ చిత్రం సాధించిన విజయంతో మరోసారి రుజువైంది" అని చెప్పారు. చిత్ర నిర్మాత గోపాల్ మాట్లాడుతూ "ఈ మూవీ కోసం టీమ్ అంతా ఎంతో కష్టపడింది. ఈ విజయం మా కష్టానికి తగిన ప్రతిఫలం" అని అన్నారు. హీరో రవి వర్మ మాట్లాడుతూ "ఈ కాలంలో ఓ సినిమా విజయోత్సవ వేడుక జరుపుకోవడం అరుదు. అలాంటి భాగ్యాన్ని మాకు అందించిన ప్రేక్షకులకు రుణపడి ఉంటాం" అని అన్నారు.

రాజు యాదవ్ ఆట పాట..



నటుడు గెటప్ శ్రీను హీరోగా నటిస్తున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కే ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి నిర్మిస్తున్నారు. మే 17న విడుదలవుతోంది. ఆదివారం చిత్ర బృందం 'దిస్ ఈజ్ మై దరిద్రం' అంటూ సాగే గీతాన్ని సుడిగాలి సుధీర్ చేతుల మీదుగా విడుదల చేసింది. కాసర్ల శ్యామ్ సాహిత్యానికి హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరాలు సమకూర్చారు. రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ ఆలపించారు. లవ్ కామెడీతో పాటు హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు సినిమాలో ఉన్నాయని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్, ఎడిటర్: బొంతల నాగేశ్వర్‌రెడ్డి.



అబ్ కీ బార్?

రాజ్‌నాథ్‌కు పోటీగా 251 సార్లు జైలుకు వెళ్లొచ్చిన వ్యక్తి

లఖ్‌నవూ, ఏప్రిల్ 28: అతనో నిత్య విద్యార్థి నాయకుడు. తన 40ఏళ్ల నాయకత్వ కెరీర్‌లో 251 సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. ఇన్ని సార్లు జైలుకు వెళ్లి వచ్చినా.. అతనిపై ఒక్కటంటే ఒక్క క్రిమినల్ కేసు కూడా లేదు. అన్నీ ఏదో ఒక పోరాటంలో, నిరసన ప్రదర్శనలో పాల్గొని జైలుకు వెళ్లిన సందర్భాలే. అతని పేరు రవిదాస్ మల్హోత్రా. లఖ్‌నవూ లోక్‌సభ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తరఫున పోటీ చేస్తున్నాడు. ఇంతకీ ఇక్కడ రవిదాస్ ప్రధాన ప్రత్యర్థి ఎవరంటే.. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. అయినప్పటికీ రవిదాస్ తన విజయం పట్ల ధీమాగా ఉన్నాడు. రవిదాస్ 26 ఏళ్ల వయస్సులో లఖ్‌నవూ యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు.



నవాబులు, నిజాంల అరాచకాలపై మాట్లాడరేం?

▸ కర్ణాటక ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశానికి చెందిన రాజులు, మహారాజులను అవమానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ.. బుజ్జగింపు రాజకీయాల కోసం నవాబులు, నిజాంలు, సుల్తాన్‌లు, బాద్షాలు చేస్తున్న అరాచకాలపై మౌనంగా ఉన్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటకలోని బెళగావి, ఉత్తర కన్నడ జిల్లా శిరసి, దావణగెరె, బళ్లారి జిల్లా హొసపేట బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. "ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని దేశ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించిన పుస్తకాలను కాంగ్రెస్ రాయించింది. కాంగ్రెస్ యువరాజు నేటికీ ఆ పాపాలను కొనసాగిస్తున్నారు. పేదల భూములు, ఆస్తులను రాజులు, మహారాజులు కబ్జా చేశారని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో ఛత్రపతి శివాజీ, కిట్టూరు రాణి చెన్నమ్మ వంటి మహానుభావులను కాంగ్రెస్ అవమానించింది. అదే సమయంలో దేశ చరిత్రలో నవాబులు, నిజాంలు, సుల్తాన్‌లు, బాద్షాలు చేసిన దౌర్జన్యాలపై ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఆయన నోటికి తాళం వేసుకున్నారు" అని మోదీ ధ్వజమెత్తారు. ఎన్నో దేవాలయాలను అపవిత్రం చేసి, ధ్వంసం చేసిన మొఘలు చక్రవర్తి ఔరంగజేబు అణచివేతలు రాహుల్‌కు గుర్తుకురాలేదని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తిని ప్రశంసించే వారితో కాంగ్రెస్ సంతోషంగా పొత్తులు పెట్టుకుంటోందని ఆరోపించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిదని ఆరోపించారు. బెళగావిలో ఆదివాసీ మహిళపై జరిగిన దారుణాన్ని, చిక్కోడిలో జైన సన్యాసి హత్యను ప్రస్తావించారు. ఇటువంటి ఘటనలు జరగడం సిగ్గుచేటని, ఇవి కర్ణాటక ఆత్మగౌరవాన్ని దిగజారుస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ వయనాడ్ సీటులో గెలవడానికి నిషేధిత ఉగ్ర సంస్థ పీఎఫ్ఐ మద్దతు తీసుకుంటోందని మోదీ ఆరోపించారు.



మార్చి 28న బీజేపీలో చేరిన దమయంతి, భర్తృహరి, సిద్ధాంత్(బీజేపీ కండువాలు కప్పుకొన్నవారు ఎడమ నుంచి)

'జంపింగ్' బలం!

బీజేడీ మాజీ నేతలకు బీజేపీ టికెట్లు

▸ ఒడిశాలో అధిక ఎంపీ స్థానాలపై కన్ను

▸ 24 ఏళ్లుగా సీఎం పదవిలో నవీన్

▸ ఆయనకు తొలిసారి గట్టి పోటీ



ఒడిసాలో పాలక బిజూ జనతాదళ్ (బీజేడీ) నుంచి వచ్చి చేరిన నేతలనే బీజేపీ నమ్ముకుంది. లోక్‌సభకు, ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఏకకాలంలో జరుగుతున్న ఎన్నికల్లో వారికే పెద్దపీట వేసింది. ముఖ్యంగా శాసనసభ కంటే లోక్‌సభ స్థానాలే ఎక్కువ గెలుచుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. సీఎం నవీన్ పట్నాయక్‌కు తొలి నుంచీ చేదోడువాదోడుగా ఉండి పార్టీ బలోపేతానికి తోడ్పడిన భర్తృహరి మెహతాబ్, సిద్ధాంత్ మొహాపాత్ర, అనుభవ్ మొహంతి, ఆకాశ్‌దాస్ నాయక్, అరిందమ్ రాయ్, ప్రియదర్శి మిశ్రా, దంబారు సిసా, ప్రదీప్ పాణిగ్రాహి, ప్రశాంత జగదేవ్ వంటి సీనియర్ నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో అత్యధికులు లోక్‌సభకు పోటీచేస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు, నేతలు కూడా బీజేపీలోకి క్యూకట్టి అసెంబ్లీ బరిలో దిగారు. బీజేడీ అధినేత నవీన్ 2000వ సంవత్సరం నుంచి 24 ఏళ్లుగా అప్రతిహతంగా సీఎంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇన్నేళ్ల తర్వాత తొలిసారి ఆయనకు గట్టి పోటీ ఎదురవుతోంది. నిన్నమొన్నటిదాకా ఆయనతో పాటు ఉండి బీజేడీని బలోపేతం చేసిన నేతలు ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో దిగడమే దీనికి కారణం. నీతి నిజాయితీలకు మారుపేరుగా నిలిచిన నవీన్ ప్రభుత్వంపై గత నాలుగేళ్లుగా తీవ్ర అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సంస్థాగతంగా బీజేడీ బలహీనపడుతోందన్న వాదన పార్టీ నేతల్లోనే వినిపిస్తోంది. ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్న బీజేపీలోకి పలువురు నాయకులు చేరిపోయారు. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలకు గాను గత ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 8 స్థానాల్లో గెలిచింది. అసెంబ్లీలో మాత్రం 23 సీట్లకే పరిమితమైంది. 12 ఎంపీ స్థానాలు గెలిచిన బీజేడీ.. అసెంబ్లీకి వచ్చేటప్పటికి 147 సీట్లకు గాను ఏకంగా 112 గెలుచుకుంది. ఒడిశాలో మే 13 నుంచి నాలుగు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. 1998 నుంచి 2009 వరకు ఒడిసాలో బీజేడీ, బీజేపీ కలిసి నడిచాయి. 2009లో తెగతెంపులు చేసుకున్నాయి. మోదీ ప్రధాని అయ్యాక నవీన్ పట్నాయక్ ఆయనతో సన్నిహితంగా ఉంటున్నారు. పార్లమెంటులో కీలక బిల్లులకు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల తర్వాత మళ్లీ పొత్తు పెట్టుకోవాలని భావించారు. అయితే బీజేపీ రాష్ట్ర శాఖ అంగీకరించలేదు. బీజేడీ సంస్థాగతంగా బాగా బలహీనపడిందని.. ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని అధిష్ఠానానికి నివేదికలు పంపారు. దీంతో పాటు, 15 లోక్‌సభ సీట్లను బీజేపీకి కేటాయించాలన్న డిమాండ్‌కు నవీన్ అంగీకరించకపోవడంతో పొత్తు కుదరలేదు.

- సెంట్రల్ డెస్క్

ఎన్నికల్లో ఏఐ హవా!

విరివిగా వాడుతున్న అభ్యర్థులు, పార్టీలు

■ అభ్యర్థుల తరఫున ఓటర్లకు ఏఐ ఫోన్ కాల్స్

■ ప్రజల్లో చొచ్చుకుపోయేందుకు ఏఆర్ టెక్నాలజీ

■ దివంగత నేతలు కూడా ప్రజల ముందు ప్రత్యక్షం!







ఎండలు మండిపోతున్నాయి..! ప్రచారానికి సమయం లేదు..! ఓటర్లందరినీ కలిసేందుకు సుడిగాలి పర్యటనలకు చాన్సే లేదు..! సోషల్ మీడియా ప్రచారంతో హోరెత్తించాలన్నా.. ఓటర్లు విసిగిపోయారు..! టీవీలు, పత్రికలు, సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో యాడ్స్ ఇచ్చినా.. అవి తమ నియోజకవర్గ ఓటర్లందరికీ చేరుతాయా? అనే అనుమానం. దాంతో ఇప్పుడు రాజకీయ పార్టీలు కృత్రిమ మేధ (ఏఐ), ఆగ్మెంటెడ్ రియాల్టీ(ఏఆర్), ఇతర అధునాతన సాంకేతికతలను వినియోగిస్తున్నాయి. అభ్యర్థులు టెక్నాలజీ సాయంతో దూసుకుపోతున్నారు.

నేరుగా ఓటర్లకు ఫోన్‌కాల్స్

గత ఎన్నికల వరకు అభ్యర్థుల ప్రచారం సోషల్ మీడియా పోస్టులతో దూసుకుపోయింది. ఈసారి వారు ఏఐ సాంకేతికతతో ఏకకాలంలో వందల మంది ఓటర్లకు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. అభ్యర్థుల తరఫున ఏఐ.. ఓటర్లతో అభ్యర్థి మాటలను అనుకరిస్తూ(ధ్వన్యనుకరణ) మాట్లాడుతోంది. వారి సమస్యలను తెలుసుకుంటోంది. అభ్యర్థి పట్ల ఓటర్ల ప్రశ్నలకు సమాధానాలు చెబుతోంది. వాగ్దానాలు నెరవేర్చలేకపోవడానికి కారణాలుచెబుతూ.. ఈసారి గెలిపిస్తే పక్కాగా పనులు చేస్తామంటూ హామీ ఇస్తోంది. ఫోన్లో అవతలివైపు ఉన్న ఓటరు మానసిక స్థితిని అంచనావేస్తూనే.. తనకే ఓటువేసేలా ఒప్పిస్తోంది. అజ్మీర్‌కు చెందిన ఏఐ ఆధారిత సంస్థ 'పాలిమాథ్ సొల్యూషన్స్' ఈ తరహా సేవలను ప్రారంభించింది. ఇలా ఎన్నికల ప్రచారంలో ఏఐని వినియోగించడంలో బీజేపీ ముందంజలో ఉంది. ఇటీవల కాశీ తమిళ సంఘం కార్యక్రమంలో ప్రధాని మోదీ హిందీ ప్రసంగం ఏకకాలంలో పలు భారతీయ భాషల్లో ఆయన గొంతుతోనే తర్జుమా అయింది. ఏఐ ఆధారిత సాంకేతికతతో అది సాధ్యమైంది. ఈసారి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఏఆర్ సాంకేతికత హవా ఊపందుకుంది. దీని వాడకంలో తమిళనాడులోని అధికార పార్టీ డీఎంకే ముందంజలో ఉంది. ఆ పార్టీ దివంగత నేత కరుణానిధిని ఏఆర్ టెక్నాలజీతో ఓటర్ల ముందుకు తీసుకెళ్తున్నారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌ను.. ఆయన పరిపాలనను ఏఆర్ టెక్నాలజీ ద్వారా కరుణానిధి పొగడ్తలతో ముంచెత్తే వీడియోలు ఇప్పుడు అక్కడి ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. డీఎంకే ప్రధాన ప్రత్యర్థి పార్టీ ఏఐఏడీఎంకే.. ఏఆర్ టెక్నాలజీని వాడుకునేంతలా పోటీ పెరగడం గమనార్హం..! అన్నాడీఎంకే దివంగత నాయకురాలు జయలలిత వీడియోలను ఆ పార్టీ ఏఆర్ ద్వారా ఓటర్ల ముందుకు తీసుకెళ్తోంది. ఇక పలు పార్టీలు తమ ముఖ్యనేతల ప్రసంగాల లింకులను క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్ రూపంలో ఓటర్లకు అందజేస్తున్నాయి. (సెంట్రల్ డెస్క్)

నాణేనికి మరో పార్శ్వం

ఏఐ, ఏఆర్ సాంకేతితతో ప్రయోజనాలున్నా కొన్ని రాజకీయ పార్టీలు వాటిని ప్రత్యర్థులపై దుష్ప్రచారానికి వాడుతున్నాయి. డీప్‌ఫేక్ వీడియోలే ఇందుకు ఉదాహరణ. ఒక నాయకుడు మాట్లాడిన మాటలను తప్పుదోవ పట్టించేలా హావభావాలతో సహా ట్యాంపరింగ్‌చేయడమే డీప్‌ఫేక్. సదరు నేత గొంతుతో అదే పిచ్‌లో ఏమాత్రం తేడాలేకుండా వాయిస్‌ను మార్చేస్తారు. ఇటీవల తెలంగాణ పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రసంగాన్ని డీప్‌ఫేక్ చేసి.."ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఎత్తేస్తాం" అని ఆయన అన్నట్లుగా డీప్‌ఫేక్ చేశారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈమేరకు ఈసీకి ఫిర్యాదు చేసింది. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాని మోదీ వీడియోలనూ డీప్‌ఫేక్ చేశారనే ఆరోపణలు రావడం గమనార్హం..! రణ్‌వీర్ సింగ్ ఓ పార్టీకి మద్దతిస్తున్నట్లు వచ్చిన డీప్‌ఫేక్ వీడియోపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడమేకాకుండా..ఎక్స్‌లో వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ప్రముఖ న్యూస్ చానళ్లలో వార్తలు వచ్చినట్లుగా ఆయా వార్తా సంస్థల లోగోలతో క్రియేట్ చేస్తున్న డీప్‌ఫేక్ వీడియోలు ప్రత్యర్థి పార్టీలను ఇరకాటంలో పారేస్తున్నాయి. దీంతో వివరణలు ఇచ్చుకోలేక ప్రత్యర్థిపార్టీలు తంటాలు పడుతున్నాయి.

రంగంలోకి సునీత

ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ సతీమణి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బయటకు వచ్చే అవకాశాలు లేకపోవడంతో ఆయన సతీమణి సునీత స్వయంగా ఎన్నికల ప్రచారంలోకి దిగారు. 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' (జైలుకు జవాబు ఓటే) అంటూ సాగే పాటతో శనివారం ఆమె తూర్పు ఢిల్లీలో, ఆదివారం పశ్చిమ ఢిల్లీలో నిర్వహించిన రోడ్ షోలకు భారీ స్పందన లభించింది. ఇప్పటి వరకు ఇండియా కూటమి ఢిల్లీలో, రాంచీలో నిర్వహించిన ఎన్నికల సభల్లో పాల్గొన్న సునీతా కేజ్రీవాల్.. పోలింగ్ సమీపిస్తుండటంతో ప్రత్యక్షంగా ప్రజల్లోకి వచ్చారు. ఢిల్లీలోని ఏడు స్థానాలకు మే 25వ తేదీన పోలింగ్ జరగనుంది. కేజ్రీవాల్ కన్నా ఏడాది ముందు 1994లో ఐఆర్ఎస్‌కు ఎంపికైన సునీతా కేజ్రీవాల్ 22 ఏళ్లు ఆదాయపన్ను శాఖలో పని చేశారు. 2016లో ఆదాయపన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో కమిషనర్ హోదాలో ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. విద్యాధికురాలు కావడం, హిందీ, ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతుండటంతో యువతతోపాటు వివిధ వర్గాల ప్రజలు ఆమె ప్రసంగాలను ఆసక్తిగా వింటున్నారు. కాగా, ఆప్ ప్రచారంలో భాగంగా తీసుకొచ్చిన 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' పాటను ఎన్నికల సంఘం నిషేధించింది. ఇదిలా ఉండగా, సునీతా కేజ్రీవాల్ ఢిల్లీలోనే కాక పంజాబ్, గుజరాత్ , హరియాణాల్లో కూడా ప్రచారం చేస్తారని మంత్రి ఆతిషీ తెలిపారు.

బీజేపీ మళ్లీ వస్తే స్వేచ్ఛ ఉండదు: ఖర్గే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దేశంలో ప్రజలు స్వేచ్ఛగా బతికే హక్కును కాంగ్రెస్ కల్పించిందని, ఆ హక్కును లాగేసుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించిందని గుర్తుచేశారు. దీనివల్ల కొన్ని కోట్లమంది యువతకు ఓటేసే అవకాశం దక్కిందని తెలిపారు. అటవీ హక్కుల చట్టం-2006ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని, దీనికోసం నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

దేవెగౌడ మనవడి అశ్లీల వీడియోలపై సిట్

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హాసన్ సిటింగ్ ఎంపీ, జేడీఎస్ నాయకుడు ప్రజ్వల్ రేవణ్ణపై వస్తున్న 'అశ్లీల పెన్‌డ్రైవ్' ఆరోపణలపై కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఏడీజీపీ బీకే సింగ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశామని రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర్ ఆదివారం ప్రకటించారు. కాగా.. అశ్లీల వీడియోల అంశం హల్‌చల్ చేస్తున్న సమయంలోనే ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్లిపోవడం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. అయితే సిట్ దర్యాప్తులో భాగంగా ఆయన్ని వెనక్కి తీసుకువచ్చి విచారిస్తామని పరమేశ్వర్ తెలిపారు. మరోవైపు.. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి పలు వీడియోలు ప్రస్తుతం రాష్ట్రమంతటా వైరల్‌గా మారాయి. ప్రజ్వల్ రేవణ్ణ పలువురు మహిళలతో అశ్లీలంగా ఉన్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దీంతో బాధిత మహిళలు న్యాయం చేయాలని టీవీ చానళ్లు, మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రజ్వల్ అశ్లీల వీడియోలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరి సీఎంకు లేఖ రాశారు. ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం బెంగళూరులో మాట్లాడుతూ.. ప్రజ్వల్ దేశం విడిచి పారిపోవడం సిగ్గుచేటన్నారు. కాగా.. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కావాలని మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేశారని ప్రజ్వల్ రేవణ్ణ ఆరోపించారు. ఇదిలా ఉండగా, లైంగిక వేధింపులు, నిర్బంధం ఆరోపణలపై మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ, ఆయన కుమారుడు హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై ఆదివారం హోళెనరసిపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదుదారు రేవణ్ణ సతీమణి భవాని బంధువుగా పేర్కొన్నారు. తాను వంటమనిషిగా పనిచేయడం ప్రారంభించిన నాలుగు నెలల తర్వాత రేవణ్ణ తనను వేధించారని, ఆయన కుమారుడు ప్రజ్వల్ తన కుమార్తెకు వీడియో కాల్స్ చేసి అసభ్యంగా మాట్లాడేవారని ఆమె ఆరోపించారు.

కాంగ్రెస్‌కు మరో షాక్!


ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు అర్విందర్ రాజీనామా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌ను కష్టాలు వీడటం లేదు. పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్‌లవ్లీ తన పదవికి ఆదివారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. పార్టీని వీడటానికి గల కారణాలను అందులో వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో పొత్తుకు కాంగ్రెస్ ఢిల్లీ యూనిట్ అంగీకరించలేదని, అయినా హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి పని చేశామని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ తరఫున పోటీ పడుతున్న కొందరు అభ్యర్థులు ఆప్‌ను ఆకాశానికి ఎత్తేయటం కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయని.. ఈశాన్య ఢిల్లీ నుంచి కాంగ్రెస్ టికెట్ మీద పోటీ పడుతున్న కన్హయ్య కుమార్‌పై విమర్శలు గుప్పించారు. విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాల పరంగా ఢిల్లీలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ మాజీ సీఎం షీలాదీక్షిత్ హయాంలోనే జరిగిందని, ఆప్ హయాంలో అదం తా దెబ్బతిన్నదన్నారు. ఢిల్లీలోని 7సీట్లలో 4 ఆప్ తీసుకొని 3కాంగ్రెస్‌కు ఇవ్వటంపై అసంతృప్తి వ్యక్తం చేశా రు. ఒక స్థానంలో తన పేరు బలంగా వినిపించినా సీనియర్ల కోసం స్వచ్ఛందంగా పోటీ నుంచి వైదొలిగానని తెలిపారు. 3స్థానాల్లో రెండింట ఢిల్లీతో సంబం ధంలేని వ్యక్తులకు (కన్హయ్య కుమార్, ఉదిత్ రాజ్) సీట్లు కేటాయించడం సరికాదన్నారు. డీపీసీసీ అధ్యక్షుడి హోదాలో పార్టీ పదవుల నియామకాలను చేపట్టేందుకు ఢిల్లీ పార్టీ ఇంచార్జి తనకు అనుమతివ్వలేదని.. ఆయనే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని లవ్లీ ఆరోపించారు. లవ్లీ షీలాదీక్షిత్ మంత్రివర్గంలో మంత్రిగా ఉన్నారు. లవ్లీ రాజీనామాను పార్టీ హైకమాండ్ ఆమోదించిందని పార్టీ ఢిల్లీ ఇంచార్జి దీపక్ బబారియా తెలిపారు. కాగా లవ్లీ బీజేపీలో చేరి తూర్పు ఢిల్లీనుంచి పోటీ చేయవచ్చన్న వార్తల నేపథ్యంలో ఏపార్టీలో చేరడంలేదని ఆయన వివరణ ఇ చ్చారు.

2.9లక్షల కోట్లు..400 గేట్లు

దుబాయ్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద విమానాశ్రయం

ఆమోదం తెలిపిన దేశాధినేత



ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు లోపలి భాగం(నమూనా)

దుబాయ్, ఏప్రిల్ 28: ప్రపంచ వాణిజ్య కేంద్రంగా ఉన్న దుబాయ్ కిరీటంలో మరో మణి చేరనుంది. నూతనంగా మరో విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్టు పాలకుడు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఆదివారం ప్రకటించారు. ఇది ప్రపంచంలో అతి పెద్ద విమానాశ్రయం కానుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న విమానాశ్రయానికి ఇది అయిదు రెట్లు పెద్దదిగా ఉండనుంది. 35 బిలియన్ డాలర్ల (రూ.2.9లక్షల కోట్లు) వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. వచ్చే పదేళ్లలో దీన్ని పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న ఎయిర్ పోర్టు ప్రపంచంలో అత్యంత రద్దీ ఉన్న విమానాశ్రయాల్లో ఒకటిగా పేరు పొందింది. రద్దీ పెరుగుతుండడం, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొత్తది నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుత ఎయిర్ పోర్టులో రెండు రన్‌వేలు ఉండగా, కొత్త దాంట్లో అయిదు సమాంతర రన్‌వేలను నిర్మిస్తారు. 400 ఎయిర్‌క్రాఫ్ట్ గేట్లు ఏర్పాటు చేయనున్నారు. ఏటా 26 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా సౌకర్యాలు కల్పించనున్నారు. దుబాయ్ దక్షిణ ప్రాంతంలో దీన్ని నిర్మిస్తారని, దీనిని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయంగా పిలుస్తారని దేశాధినేత ప్రకటించారు.

ఆర్మేనియాకు ఆయుధాలిస్తే ఊరుకోం

భారత్‌కు అజెర్‌బైజాన్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ఆర్మేనియాకు ఆయుధాలను సరఫరా చేస్తే చూస్తూ ఊరుకోబోమని అజెర్‌బైజాన్ దేశం భారత్‌ను హెచ్చరించింది. ఫ్రాన్స్ గ్రీస్ దేశాలను ఉద్దేశించి కూడా ఇదే తరహాలో హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు భారత్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేయడంపై ఆర్మేనియా ఆసక్తి చూపుతోంది. భారత్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేస్తున్న దేశాల్లో ఆర్మేనియా మొదటి స్థానంలో ఉంది. బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులు కొనుగోలు చేయడంపైనా ఆసక్తి చూపుతోంది. 'పినాక' మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు కొనుగోలు చేయడానికి 2022లో ఒప్పందం కుదిరింది. పినాక రాకెట్ లాంచర్లను కొనుగోలు చేసిన తొలి దేశం కూడా ఆర్మేనియాయే కావడం గమనార్హం. ఆర్మేనియాకు ఆయుధాలు సరఫరాను భారత్ చాలా కాలం రహస్యంగానే ఉంచింది. అయితే కొన్ని కంపెనీలు తమ వార్షిక నివేదికల్లో అమ్మకాల వివరాలను పేర్కొనడం తప్పనిసరి కావడంతో అవి బయటపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన జెన్ టెక్నాలజీస్ సంస్థ ఆర్మేనియాకు 41.5 మిలియన్ డాలర్లు (రూ.345 కోట్లు)విలువ చేసే యాంటీ డ్రోన్ సిస్టంలను సరఫరా చేసింది.

గుజరాత్ తీరంలో 602 కోట్ల డ్రగ్స్

▸ దేశంలోకి చేరవేసేందుకు పాకిస్థానీల కుట్ర

▸ బోటు స్వాధీనం.. 14 మంది అరెస్టు

అహ్మదాబాద్, ఏప్రిల్ 28: దేశంలోకి మాదకద్రవ్యాలను చేరవేసేందుకు పాకిస్థానీలు పన్నిన కుట్రను భారత తీర ప్రాంత రక్షక దళం భగ్నం చేసింది. శనివారం రాత్రిపూట గుజరాత్ తీరంలో భారీ ఆపరేషన్ నిర్వహించి ఓ బోటును పట్టుకుంది.. అందులో నుంచి ఏకంగా రూ.602 కోట్ల విలువైన 86 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని, 14 మంది పాకిస్థానీలను అదుపులోకి తీసుకుంది. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు తీర ప్రాంత రక్షక దళం, గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)తో కలిసి అరేబియా తీరంలో మాటేశాయి. శనివారం రాత్రి సముద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బోటు కదలికలను గుర్తించి అప్రమత్తమయ్యాయి. కోస్టు గార్డు నౌక రాజ్‌రతన్, హెలికాప్టర్లతో ఆ బోటును ముట్టడించాయి. ఈక్రమంలోనే బోటులోని వారు కాల్పులు జరిపి తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరుపుతూ చాకచక్యంగా బోటు లోపలికి ప్రవేశించాయి. అందులోని 14 మందిని అదుపులోకి తీసుకొని, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఇదిలా ఉండగా, గుజరాత్, రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ తయారీ ల్యాబ్‌లపై ఏటీఎస్, ఎన్‌సీబీ శుక్రవారం సాయంత్రం సంయుక్తంగా దాడులు జరిపి రూ.300 కోట్ల విలువైన మెఫెడ్రోన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు 13 మందిని అరెస్టు చేశాయి. అహ్మదాబాద్ ప్రాంతానికి చెందిన మనోహర్‌లాల్ ఎనానీ, రాజస్థాన్‌కు చెందిన కుల్దీప్ సింగ్ రాజ్‌పురోహిత్ వివిధ ప్రాంతాల్లో మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ యూనిట్లను నడుపుతున్నట్లు ఏటీఎస్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ నేపథ్యంలోనే రాజస్థాన్‌లోని సిరోహి, జోధ్‌పూర్, గాంధీనగర్ ప్రాంతాలతో పాటు గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లాలోని భక్తినగర్‌లో ఏకకాలంలో ఎన్‌సీబీతో కలిసి దాడులు చేసింది. వీటిల్లో 22 కిలోల మెఫెడ్రోన్, 124 కిలోల లిక్విడ్ మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నామని.. వీటి విలువ రూ.300 కోట్లు దాకా ఉంటుందని అధికారులు వెల్లడించారు.

విదేశీ విద్యార్థుల కోసం అదనంగా 25% సీట్లు

విద్యాసంస్థలకు యూజీసీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: విదేశీ విద్యార్థుల కోసం అదనంగా 25% సీట్లను పెంచుకోవచ్చని ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ సూచించింది. ప్రస్తుతం అనుమతించిన సీట్లకు అదనంగా వీటిని పెంచుకోవచ్చని తెలిపింది. వీటిని సూపర్‌న్యూమరరీ సీట్లుగా వ్యవహరిస్తారని, వీటిని కేవలం విదేశీ విద్యార్థులకు మాత్రమే రిజర్వు చేయాలని స్పష్టం చేసింది. యూజీ, పీజీ కోర్సులకు ఇది వర్తిస్తుందని తెలిపింది. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద ఎంపికయిన విద్యార్థులకు ఈ సూపర్‌న్యూమరరీ కోటా వర్తించదు. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో సీట్లు మిగిలితే వాటిని కూడా విదేశీ విద్యార్థులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) కోర్సుల్లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి అనుమతి లేదని యూజీసీ తెలిపింది.

7న రాజమండ్రికి ప్రధాని.. అనకాపల్లిలో సభ

అమరావతి, రాజమహేంద్రవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం నిమిత్తం 7వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. రెండు రోజులపాటు ఆయన రాష్ట్రంలో పలు సభల్లో పాల్గొననున్నారు. 7వ తేదీ మధ్యాహ్నం రాజమండ్రి, సాయంత్రం అనకాపల్లి సభల్లో పాల్గొంటారు. మరుసటి రోజు 8న మధ్యాహ్నం పీలేరు సభలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం విజయవాడలో చంద్రబాబు, పవన్, పురందేశ్వరితో కలసి రోడ్ షోలో ప్రధాని మోదీ పాల్గొంటారు.

1 నుంచి భువనేశ్వరి ఎన్నికల ప్రచారం

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ.. ఎన్నికల ప్రచారం చేయనున్నారు. మే 1న కడప, 2న పాణ్యం, 3న దర్శిలో ఎన్నికల ప్రచార సభల్లో ఆమె పాల్గొననున్నారు.

నేడు మంగళగిరిలో బ్రాహ్మణి పర్యటన

టీడీపీ యువనేత నారా లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి సోమవారం మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. తాడేపల్లి మండలం నులకపేట చైతన్య తపోవన్ శ్రేయో మండపంలో స్త్రీశక్తి, మహిళామిత్ర, డ్వాక్రా మహిళలతో ఆమె సమావేశం కానున్నారు.

లోకం తీరు







• కోటప్పకొండలో తాగునీటి చెరువు



వైసీపీ డ్రామాలను ప్రజలు నమ్మరు

• గొడవర్రు రచ్చబండలో మాట్లాడుతున్న లోకేశ్

- తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని జగన్ ప్రజలకు న్యాయం చేస్తాడా
- టీడీపీ అధికారంలోకి వస్తే స్థానికంగానే ఐటీ ఉద్యోగాలు కల్పిస్తా
- గొడవర్రు రచ్చబండలో నారా లోకేశ్

దుగ్గిరాల, ఏప్రిల్ 28: వైసీపీ కోడికత్తి, గులకరాయి డ్రామాలు, శవ రాజకీయాలను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని టీడీపీ మంగళగిరి అభ్యర్థి నారా లోకేశ్ తెలిపారు. మండలంలోని గొడవర్రులో ఆదివారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 2019లో కోడికత్తి ఘటన తర్వాత బాబాయి ఎగిరిపోయారని, 2024 గులకరాయి డ్రామాతో ఎవరికి మూడుతుందోనని భయపడి తల్లి విదేశాలకు వెళ్లిపోయారన్నారు. దీంతో ఇప్పుడు ఎవరి శవం లేస్తుందోనని ప్రజలు వణికి పోతున్నారన్నారన్నారు. ఏపాపం తెలియని దళిత బిడ్డ కోడికత్తి శ్రీను జెగ్యాంగ్ చెప్పినట్లు చేసినందుకు ఐదేళ్లపాటు జైల్లో ఉన్నారన్నారు. గులకరాయి తగిలిందని చెప్పి జగన్ తలపైవేసిన బ్యాండేజ్ సైజు రోజురోజుకు పెరుగుతూ వచ్చి శనివారం మాయమైందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఐటీ కంపెనీలు తీసుకొచ్చి స్థానికంగానే ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పింఛన్లు సకాలంలో అందించకుండా 32 మంది వృద్ధుల మృతికి కారణమైందే కాకుండా రాజకీయాలు చేయాలని జగన్ చూశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల మందికి వైసీపీ ప్రభుత్వం పింఛన్లు తొలగించిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, కాసరనేని జస్వంత్, పడవల మహేష్, సర్పంచ్ విశ్వనాధపల్లి ఉమాదేవి, ఎంపీటీసీ శివకుమార్, తాళ్ల అశోక్, పాటిబండ్ల హరిప్రసాద్, మొలబంటి ధనుంజయ, మాజీసర్పంచ్ చౌడవరపు నల్లమ్మ, తోటపిచ్చయ్య, ప్రసంగి కొండలు, నడుకుదురు బ్రహ్మయ్య, అంచే మారుతీవరప్రసాద్, బాపిరాజు, గోరంట్ల అరుణకుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు పసుపులేటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న లోకేశ్

చనిపోయానని కార్డు తీసేశారు బాబూ

చచ్చిపోయానంటూ తన రేషన్‌కార్డు తొలగించారు ఇదెక్కడి న్యాయం అని రచ్చబండలో లోకేశ్ ఎదుట లక్ష్మీసామ్రాజ్యం కన్నీరు మున్నీరయ్యారు. టీడీపీ అధికారంలోకి వచ్చాకైనా తనకు పింఛన్ ఇవ్వాలని ఆమె కోరారు. దీనికి లోకేశ్ స్పందిస్తూ అనేక కొర్రీలు పెట్టి పింఛన్‌లు తొలగించారని, టీడీపీ అధికారంలోకి రాగానే సామ్రాజ్యం లాంటి పండుటాకులకు ఎలాంటి షరతులు లేకుండా పింఛన్లు అందిస్తామన్నారు.

కుళాయి నీరు కరువే


ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సీఎం జగన్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. కానీ చేతల్లోకి వచ్చే సరికి దారుణంగా విఫలమయ్యారు. నిధుల కొరత వెంటాడు తోంది. పనులు నత్తనడకన సాగుతున్నాయి. బాపట్ల జిల్లాలో 2,16,548 గృహాలకు, పల్నాడు జిల్లా లో 2,89,328 గృహాలకు, గుంటూరు జిల్లాలో ఇంకా 75,993 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇలానే పనులు సాగితే నిర్ణీత కాలంలో పనులు పూర్త య్యే పరిస్థితి ఉండదు. పనులు వేగవంతం చేసి ప్రజల తాగునీటి వెతలను తీర్చేందుకు అధికారులు కృషి చేయాలి.

- ఇంటింటికి రక్షిత నీరు ఎన్నటికో
- జల్ జీవన్ మిషన్ పనులు నత్తనడక
- పల్లెల్లో తీరని తాగునీటి వెతలు
- నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
- మూడు జిల్లాల్లో 10.32 లక్షల గృహాలు
- కుళాయిలు ఉన్న గృహాలు 4.51 లక్షలు
- కుళాయిల శాతం 43.66 మాత్రమే..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇంటింటికి రక్షిత నీరు అందించే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులతో పనులు చేపట్టే విధంగా ప్రణాళికను రూపొందించారు. 2019లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చాయి. తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరుశాతం కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని ఇరు ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకు రూ.1021.38 కోట్ల వ్యయం అవుతుందని వ్యయం అంచనా వేశారు. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్ల నిధుల విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాలో సుమారు రూ.105 కోట్లు నిధులు మంజూరు చేసింది. నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం వలనే జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. నిధుల కొరత వెంటాడు తుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేస్తున్నారు.

జల్‌జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యం. ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రతి వ్యక్తిగా 40 లీటర్లు నీరిచ్చే విధంగా రూపొందించబడ్డాయి. ప్రధానంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని సేవించడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. బొల్లాపల్లి, నకరికల్లు మండలాలతో పాటు, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటినే ప్రజలు వినియోగిస్తున్నారు. ఈ గ్రామాలన్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్‌జీవన్ పథకం లక్ష్యమే. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటివరకు 4,51,035 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. 43.66 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,81,869 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామ మాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. పనులు ఇంకా నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.



బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 75,948 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాల్లో 1,48,240 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కుళాయిల శాతం 19.82 శాతం నుంచి 40.64 శాతానికి పెరిగింది. ఇంకా 2,16,548 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సిం ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్లలో చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి.

పల్నాడు జిల్లాలో..

రక్షిత నీటి పరఫరాకు సంబంధించి పల్నాడు జిల్లాలో గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉన్నాయి. పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 86,905 కుళాయిలను ఇచ్చారు. జిల్లా అంతటా 1,45,071 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. 2,89,328 గృహాలకు ఇంకా కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. 33.40 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో పల్నాడు జిల్లా చిట్ట చివరన నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులు గర్తించారు. ఇందుకు సంబంధించి రూ.508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు పూర్తయ్యాయి. మూడవ వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు.

గుంటూరు జిల్లాలో...

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రా రంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళా యిలు ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతానికి పెరిగింది. ఇంకా 75,993 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్లలో రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి.



• పెద తురకపాలెంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ దుస్థితి



8 నెలలుగా... దక్కని న్యాయం

రోడ్డు విస్తరణలో 157 భవనాల కూల్చివేత • బాధితులకు నేటికీ అందని పరిహార బాండ్లు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 28: పొన్నూరులోని జీబీసీ రోడ్డు(గుంటూరు-బాపట్ల రోడ్డు) విస్తరణపై వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లకుపైగా కాలయాపన చేసి ఎనిమిది నెలల క్రితం హడావుడిగా చేపట్టింది. ఇంత చేసిన పాలకులు, అధికారులు విస్తరణ బాధితులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విస్తరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి తాజా ఉత్తర్వులు లేకపోయినా చడీ చప్పుడు లేకుండా, యజమానులకు భవనాలను ఖాళీ చేసే సమయం కూడా 157 భవనాలను నేల కూల్చారు. భవన యజమానులు అడ్డుకున్నా పోలీసులతో బలప్రయోగం చేసి తమ కార్యక్రమాన్ని ముగించారు. వైసీపీ పాలకుల అరాచకాలకు శిథిల భవనాలు శిథిలాలు నేటికీ సజీవ సాక్ష్యంగా ఉన్నాయి. నాలుగేళ్లుగా మౌనంగా ఉన్న పాలకులు ఎనిమిది నెలల క్రితం విస్తరణ చేపట్టారు. 157 భవనాల్లో 130 వరకు ఆర్యవైశ్య సామాజిక వర్గం వారే బాధితులుగా ఉన్నారు. అలాగే రహదారికి ఎడమవైపున ఉన్న భూములు 22ఏ చట్టం కింద ప్రభుత్వ రికార్డులో నమోదై ఉన్నాయి. ఈ వివాదాన్ని కూడా పరిష్కరించి బాధితులకు పరిహారం అందచేస్తామని, భూములు విలువ పెంచుతామని పాలకులు ఇచ్చిన హామీలు నేటికి అమలు కాలేదని బాధి తులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ యజమానులకు నగదు, టీడీఆర్ బాండ్లు ఇవ్వలేదు.



రోడ్డు విస్తరణలో కూల్చివేసిన భవన శిథిలాలు

న్యాయం చేస్తానని ఎమ్మెల్యే మౌనం..

విస్తరణ బాధితులతో తొలుత ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య నామమాత్రంగా సమావేశాలు నిర్వహించారు. ఆ సమావేశంలో తనను నమ్మండి న్యాయం చేస్తానని చెప్పారు. అయితే ఎనిమిది నెలలుగా ఆయన మాట్లాడటం లేదని బాధితులు వాపోతున్నారు. మూడు నెలల క్రితం 8 మంది బాధితులకు మాత్రమే టీడీఆర్ బాండ్లు అందచేశారు. వాటిలో కూడా కొందరి బాండ్లను చెలామణి నిలుపుదల చేశారు. దీనిపై అధికారులను ఆశ్రయిస్తే తమకేమీ తెలియదని ఎమ్మెల్యేను అడగాలని సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యేను ఆశ్రయిస్తే అది అధికారులు చేయాల్సిన పని తనకేమి సంబంధం అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కేవలం భవనాల మరమ్మతులకు మాత్రమే నిధులు ఇచ్చి భూమి, కట్టడాలకు పరిహారం ఇవ్వకుండా తమకు తీరని అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు.

అప్పిలేట్ అధికారిగా నచ్చినవారు..

ల్యాండ్ టైట్లింగ్ యాక్టులో అధికారమంతా అప్పిలేట్ అధికారులదే. ఆ అధికారులు ఎవరనేది స్పష్టంగా చెప్పలేదు. ఎవరినైనా నియమించవచ్చని యాక్టులో పేర్కొన్నారు. అదే జరిగితే రాజకీయ నాయకులనే ఆ స్థానంలో పెట్టుకుంటారు. తద్వారా రాజకీయ నేతల పరిధిలోకి ప్రజల ఆస్తులు వెళ్లిపోతా యి. వారు ఆడింది ఆట.. పాడింది పాటగా మారుతుంది. బాధి తులు కోర్టులకు వెళ్లాలన్నా వారు అనుమతించాల్సిందే. అంటే న్యాయ స్థానాలకు వెళ్లే అవకాశం కూడా లేనట్లే.

\- పి.రాజారావు, సీనియర్ న్యాయవాది

\- ఓ వ్యక్తి తన పేరుతో ఉన్న స్థలం అమ్మాలనుకున్నాడు. దాన్ని మీరు కొనాలనుకున్నారు. కొనుగోలు సమయంలో ఆ వ్యక్తి తన వద్ద స్థలం ఒరిజినల్ (అసలు) పత్రాలు లేవని, నఖలు (జిరాక్స్) పత్రాలు ఉన్నాయి.. వాటిని రిజిస్ట్రేషన్ చేయిస్తానన్నారు. అప్పుడు ఆ స్థలం మీరు కొంటారా? ఖచ్చితంగా కొనరు. ఎందుకని? ఆ స్థలం అతడిదో కాదో తెలుసుకోలేం. ఆ పత్రాల్లోని పేరు అసలో, నకిలీయో తెలుసుకోలేం. అలాంటి జిరాక్సులు ఎన్ని ఉన్నాయో.. ఎంత మంది దగ్గర ఉన్నాయో మనకు తెలియదు. అతడు ఇంతకముందే దాన్ని అమ్మేశాడో.. మనకు తెలియదు కాబట్టి. జిరాక్స్ పత్రాలతో ఉన్న స్థలాన్ని కొనం.





ప్రమాదంలో.. ప్రజల ఆస్తులు

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో చేటు
- నకళ్లతో ఎవరైనా హక్కుదారులుగా నమోదు
- ఆస్తి మనదేనని నిరూపించుకోవాలంటే ఇక దేవుడే దిక్కు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన డిజిటల్ రిజిస్ట్రేషన్ విధానంతో మొత్తంగా ప్రజల ఆస్తులు ప్రమాదం లో పడిపోయాయి. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 135 రకాల దస్తావేజులను పూర్తిగా డిజిటల్ రూపంలోనే ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం ఇకపై రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే లావాదేవీలకు సంబంధించి ఎలాంటి ఒరిజినల్(అసలు) పత్రాలు ఇవ్వరు. కేవలం జిరాక్సులు మాత్రమే ఇస్తారు. ప్రక్రియలో అసలు దస్తావేజుల పాత్ర, అమ్మకం, కొనుగోలుదారుల అసలు సంతకాలు, వేలిముద్రలతోగానీ పనిలేదు. అవన్నీ 'క్రిటికల్ రివర్' అనే సంస్థ వద్ద ఉంటాయి. ప్రభుత్వం సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్(ఎన్‌ఐసీ)ని పక్కన పెట్టి ప్రైవేటు సంస్థను రంగంలోకి దించడంతో ఈ ప్రమా దం మరింత పెరిగింది.

హక్కు దారులకు తెలియకుండానే అమ్ముకునే వీలు..

అసలు దస్తావేజులు, హక్కుదారుల సంతకాలు, వేలి ముద్రలు అన్నీ డిజిటల్ రూపంలో ప్రభుత్వం, అధికార యం త్రాంగం, ప్రైవేటు సంస్థ వద్దే ఉంటాయి. దీంతో కక్షిదారులతో సంబంధం లేకుండా వాటిని వారు ఏమైనా చేసే అవకాశం ఉంది. అసలు వ్యక్తులకు తెలియకుండా వాటిని తాకట్టు పెట్టుకోవచ్చు.. విక్రయించుకోవచ్చు. తిరిగి లబ్ధిదారు మళ్లీ రిజిస్ట్రేషన్‌కు వెళితే తప్ప తన ఆస్తులు ఏమయ్యాయో అతడికి తెలిసే అవకాశం లేదు.

జిరాక్సులతో రిజిస్ట్రేషన్ ప్రమాదం..

స్థలాన్ని అమ్మదలచిన వ్యక్తి తన దగ్గరున్న జిరాక్సు పత్రాలు చూపించి ఆ స్థలాన్ని ఉదయం పూట ఒక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్థలాన్ని అమ్ముకున్నాడనుకుందాం. అదే వ్యక్తి, మళ్లీ అవే జిరాక్సులతో కొద్దిసేపటి తర్వాత దగ్గరలోని వేరే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వేరొకరికి ఆ అమ్మి మళ్లీ రిజిస్టర్ చేయవచ్చు. మొదట అమ్మిన వివరాలు ఈసీలో నమోదు అవ్వాలంటే 24 గంటల సమయం గడవాలి. ఈలోపు అతడు ఎన్ని రిజిస్ట్రేషన్లైనా చేయించుకోవచ్చు. ఎంతమందికైనా అమ్ముకోవచ్చు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో మరింత చేటు

ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న భూ యాజమాన్య హక్కుల (ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్) చట్టంతో ఈ అక్రమాలకు మరింత అవకాశం ఉంది. ల్యాండ్ టైట్లింగ్ యాక్టులో భాగంగా చేపట్టే రీ సర్వేతో అందరి తలరాతలు ఒక్కసారిగా మారిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఒక్క జిరాక్సు పుట్టించుకుంటే చాలు సదరు స్థలంపై తానూ హక్కుదారుగా నమోదు చేసుకోవచ్చు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు కింద రూపొందించే వివాదాల (డిస్ప్యూట్) రిజిస్టర్‌లో పేరు నమోదు చేయించుకోగలిగితే చాలు. ఇక ఆ స్థలం హక్కుదారుకు హక్కులన్నీ పోతాయి. హక్కుదారు తన వద్ద అసలు పత్రాలు ఉన్నా సదరు స్థలాన్ని అమ్ముకోలేడు. టైట్లింగ్ అధికారి ఆమోదిస్తే తప్ప సొంతదారు ఆ స్థలాన్ని అమ్ముకోలేని పరిస్థితి వస్తుంది. అంటే మొత్తంగా సొంతదారు ఆస్తి పూర్తిగా టైట్లింగ్ అధికారి పరిధిలోకి తద్వారా రాజకీయ పెద్దల పరిధిలోకి వెళ్లిపోతుంది. స్థలం తనది అని నిరూపించుకోవాల్సిన బాధ్యత సొంతదారుడి మీదే పడుతుంది. అది తనదేనని నిర్ధారించుకునే వరకూ అతడు తన సొంత స్థలం కూడా అమ్ముకోలేడు. తన సొంత స్థలం అని నిరూపించుకోవడానికి కోర్టుకు వెళ్లే అవకాశం కూడా లేదు. ఇలా త్రిశంకు స్వర్గంలో నలిగిపోయి సర్వం కోల్పోవాల్సిన భయానక స్థితి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు దాపురించనుంది. సామాన్యుల ఆస్తులు దోపిడీ చేయడం కోసమే వైసీపీ ప్రభుత్వం ఈ విధానాలను ముందుకు తెస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

అధికార జోక్యంతో న్యాయం ఎండమావే..

భూ సమస్యలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించే అధికారం న్యాయస్థానాలకు ఉండేది. ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా దాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నారు. తద్వారా రాజకీయ పలుకుబడిలోకి వెళ్లి హక్కుదారులు ఘోరంగా నష్టపోతారు. అదే జరిగితే భూ వివాదాల్లో సామాన్యులకు న్యాయం ఎండమావే. - వేమూరి శ్రీనివాసరావు, అడ్వకేటు



అక్రమ్‌కు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్

వైసీపీకి ప్రజల షాక్ ట్రీట్మెంట్ ..

- అంజుమన్ ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడితో సహా 200 మంది టీడీపీలో చేరిక
- పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 28: ఎన్నికలు దగ్గరపడేకొద్దీ నియోజకవర్గంలో వైసీపీకి షాక్ మీద షాక్ కొడుతూనే వుంది. వైసీపీ నుంచి టీడీపీలో చేరేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తుంది. తాజాగా మంగళగిరి వైసీపీలో ముఖ్య నాయకుడు, స్థానిక అంజుమన్ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు, ఇస్లామిక్ ఫ్రంట్ సారథి అయిన షేక్ అక్రమ్ తన అనుచరులు సుమారు రెండొందల మందితో కలిసి టీడీపీలో చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ ఆదివారం ఉదయం వీరందరికీ పసుపు కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే తాడేపల్లి పట్టణ ముస్లిం నాయకులు షేక్ బుడే ఆధ్వర్యంలో షేక్ ఖాజా, షేక్ భాషా, షేక్ ముక్తియార్ సహా 22 ముస్లిం కుటుంబాలు యువనేత సమక్షంలో టీడీపీలో చేరారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు మొదటిసారిగా కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసిన ఘనత అన్న ఎన్టీఆర్‌దేనన్నారు. తరువాత చంద్రబాబు హజ్‌హౌస్ నిర్మాణం చేసి ముస్లింల పట్ల తనకున్న మమతానురాగాలను చాటుకున్నారన్నారు. మైనారిటీవర్గాలో పేదల సంఖ్య ఎక్కువగా వుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీల కోసం రంజాన్ తోఫా, దుల్హన్, హజ్‌యాత్రకు సబ్సిడీ, రంజాన్ సమయాల్లో మసీదులకు రంగులు వేయించడం, షాదీఖానాల నిర్మాణం, విదేశీవిద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. జగన్ అధికారంలో వచ్చాక వాటన్నింటిని రద్దుచేసి ముస్లింలకు చాల అన్యాయం చేశాడన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని తిరిగి పునరుద్ధరించడంతో పాటు ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటుచేసి పేద ముస్లింలకు సబ్సిడీలపై రుణాలను అందజేస్తామన్నారు. మైనారిటీ విద్యార్థుల కోసం కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో పెద్ద సైకో, మంగళగిరిలో చిన్న సైకో వున్నాడన్నారు. అధికారంలోకి వచ్చాక మైనారిటీలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయిస్తామని లోకేశ్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, వల్లభనేని వెంకట్రావు, దామర్ల రాజు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, మహ్మద్ ఇబ్రహీం, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

కేంద్ర సహకారంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 28: ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం మంత్రి విడదల రజిని సొంత గ్రామం పురుషోత్తపట్నంలో జరిగిన కార్యక్రమంలో 100కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పీఏసీఎస్ మాజీ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు ఆధ్వర్యంలో నీటి సంఘం మాజీ చైర్మన్ విడదల సాంబయ్య, మిరియాల లక్ష్మీనారాయణ, తోట పుల్లప్ప, తోట శివయ్య తదితరులు ఉన్నారు. వీరికి ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సొంత గూటికి వచ్చిన అందరికీ అభినందనలు తెలిపారు. బీజేపీతో పొత్తు వల్ల ఏ వర్గానికి ఇబ్బంది రాదని చంద్రబాబు ఇప్పటికే స్పష్టమైన హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానికంగా చూస్తే గత ఎన్నికల్లో పురుషోత్తపట్నంలో వైసీపీకి భారీ మెజార్టీ ఇచ్చారని, ఈసారి రివర్స్‌లో తెలుగుదేశానికి భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని ఆయన అన్నారు. రానున్న ఐదేళ్లల్లో చిలకలూరిపేటలో అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని ప్రత్తిపాటి అన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆటబొమ్మ రోశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, వేదికపై మాధవి తదితరులు

- నేనైతే రాజీనామా చేసి జగన్ మొహాన కొట్టేవాడిని
- మూడు రాజధానులు కావాలన్న రోశయ్యపై పెమ్మసాని ఫైర్

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): 'కిలారు రోశయ్య సీఎం జగన్ ఆటబొమ్మ.. మూడు రాజధానులు కావాలని జగన్ చెప్పమంటే ఆయన చెప్పేస్తారా? ప్రజల గురించి ఆలోచించేది లేదా? అదే నేనైతే రాజీనామా చేసి జగన్ మొహాన కొట్టి వచ్చేవాడిని' అంటూ వైసీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారు రోశయ్యపై కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విరుచుకుపడ్డారు. గుంటూరులోని 38వ డివిజన్లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలారు రోశయ్య 700 ఎకరాల్లో గ్రావెల్ తవ్వి అక్రమ సంపాదనను వెనకేసుకున్నారని అందుకే జగన్ చెప్పినట్టల్లా ఆడుతున్నారని విమర్శించారు. అక్రమ మైనింగ్ ద్వారా రూ.2,300 కోట్లు అవినీతి చేశారు కాబట్టే, జగన్ చెప్పినదానికల్లా తల ఊపుతున్నారని విమర్శించారు. అందుకే ఎంపీగా ఓడిపోతారని తెలిసినా సరే గత్యంతరం లేక రోశయ్య పోటీ చేస్తున్నారని అన్నారు. అలాగే గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న రజని ఒక పద్ధతి ప్రకారం అవినీతి చేస్తున్నారని, అందుకే చిలకలూరిపేట ప్రజలు వద్దనుకున్నారని చెప్పారు. అందువల్లే ఓటమి భయం కొద్దీ ఆమె గుంటూరు వచ్చి ఆమె చేరారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులకు, యువతకు ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు, దేశాలకు వలస పోవాల్సిన అవసరం వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమెరికాలో స్థిరపడ్డ ప్రవాసాంధ్రుల సహకారంతో పార్లమెంట్, రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలను తీసుకురావాలంటే ఒక కఠోర శ్రమ అవసరమని సొంత నేలపై, పుట్టిన భూమిపై ప్రేమ ఉన్నవారికి మాత్రమే ఆ ప్రయత్నం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గళ్లా మాధవి మాట్లాడుతూ ఈ అరాచక ప్రభుత్వాన్ని అరికట్టాలంటే ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల హరి, స్థానిక నేతలు విఠల్రావు, కార్పొరేటర్ పద్మ పాల్గొన్నారు.

పెమ్మసాని ఆధ్వర్యంలో 180 కుటుంబాలు చేరిక

విడుదల రజని అంత జన హృదయ నేత అయితే చిలకలూరిపేట నుంచి ఎందుకు మడమ తిప్పారు? రిటర్నింగ్ అధికారికి ఆమె సమర్పించిన అఫిడవిట్‌కు, ఆస్తులకు ఏమైనా సంబంధం ఉందా? అని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశ్నించారు. గుంటూరులోని స్థానిక 33వ డివిజన్లో ఆదివారం 100 సుమారు 180 కుటుంబాలు టీడీపీలో ఆదివారం చేరాయి. పెమ్మసాని, గళ్లా మాధవి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ ప్రశాంత్, ఖాదర్, కిరణ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న కార్యకర్తలకు ఆహ్వానం పలికారు. బటన్ నొక్కడడానికి సీఎంతో పనిలేదని, ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉన్నా సరిపోతుందని అంటూనే ముఖ్యమంత్రి అంటే అభివృద్ధి, ప్రజా సంక్షేమం గురించి తెలిసి ఉండాలని జగన్‌కు చురకలు అంటించారు. పక్కనే పారుతున్న నది, పుష్కలమైన రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నా సరే తాగడానికి నీళ్లు ఇవ్వలేని ఈవైసీపీ నాయకులు ప్రజలను ఐదేళ్లుగా కష్టాలపాలు చేశారన్నారు. ఇల్లు దాటి బయటకు రాలేని జగన్‌కు ప్రజల కష్టాలు ఎలా అర్థమవుతాయి అని ప్రశ్నించారు. మాధవి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి ఆంధ్రప్రదేశ్‌ను జగన్ 20 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారని విమర్శించారు. శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ ఏపీ రాజధానిగా అమరావతి ఉంటుందని, అసెంబ్లీ సాక్షిగా జగన్ అంగీకరించారని, సీఎం అయ్యాక ఆ మాట తప్పి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తాళ్ల వెంకటేష్‌యాదవ్, మైనార్టీ నేతలు సయ్యద్ ముజీబ్, కార్పొరేటర్ ఈరంటి హరిబాబు(బుజ్జి), డివిజన్ నాయకులు పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



పెమ్మసాని, షరీఫ్‌లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్థానిక నేతలు

వైసీపీ కంచుకోటలో కూటమికి బ్రహ్మరథం



శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

- అరవిందబాబు, శ్రీకృష్ణదేవరాయలు ర్యాలీకి విశేష స్పందన
- పరిసర గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

నరసరావుపేటరూరల్, ఏప్రిల్ 28: వైసీపీ కంచుకోట నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నరసరావుపేట టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, లావు శ్రీ కృష్ణ దేవరాయలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దశాబ్దాలుగా టీడీపీ కనీసం ప్రచారం కూడా చేయని ప్రాంతంలో వేలాదిమందితో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గం లింగంగుంట్ల గ్రామంలో వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. పదేళ్లుగా జగన్‌రెడ్డి కోసం, వైసీపీ జెండా మోసిన కార్యకర్తలను దగా చేశాడంటూ కార్యకర్తలు ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల జీవితాలు కారు చీకట్లలో మగ్గిపోతున్నాయని డాక్టర్ చదలవాడ అరవింద బాబు ధ్వజమెత్తారు. నవరత్నాల పేరుతో నయవంచనకు పాల్పడిన జగన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి, గోపిరెడ్డిని నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ధరల బాదుడు, చంద్రబాబు రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలివ్వాలని తాపత్రయపడితే.. జగన్ రెడ్డి కల్తీ మద్యం, గంజాయి డ్రగ్స్ తెచ్చి యువత జీవితాలను ఛిద్రం చేశాడని మండిపడ్డారు. చంద్రబాబు అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తే జగన్ రెడ్డి మాత్రం దోచుకోవడం దాచుకోవడంతో రాష్ట్రాన్ని అవస్థలపాలు చేశాడని డాక్టర్ చదలవాడ ధ్వజమెత్తారు. అరాచక ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టి ప్రజాస్వామ్య పాలన సాధనకోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని డాక్టర్ చదలవాడ, లావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రి యాదవ్, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు



ప్రసంగిస్తున్న వల్లంరెడ్డి లక్ష్మారెడ్డి, వేదికపై అరవిందబాబు తదితరులు

అభివృద్ధి ప్రస్తావన లేని వైసీపీ మేనిఫెస్టో

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్28: వైసీపీ మేనిఫెస్టోలో ప్రజల సొమ్ముతో ఓట్లు దండుకునే పథకాల కొనసాగింపుకు ప్రాధాన్యం ఇచ్చారేతప్ప ఎక్కడా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక ప్రస్తావనే లేదని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శించారు. ఆదివారం గుంటూరులోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ మేనిఫెస్టోలో మద్య నిషేధం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. 14 లక్షల కోట్లకు పైగా పెరిగిన అప్పుల భారానికి పరిష్కారం చూపలేదన్నారు. విశాఖ స్టీల్, కడప స్టీల్, విశాఖ రైల్వే జోన్, ప్రత్యేక హోదాల ప్రస్తావన లేదని తెలిపారు. మూడు రాజధానులను కొనసాగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లుగా మార్చుకోవాలనే కుటిల ప్రయత్నంగా కనిపిస్తుందన్నారు. లోక్‌సత్తా గుంటూరు జిల్లా కార్యదర్శి డాక్టర్ నూతలపాటి అరవింద్, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓ.నారాయణరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 28: అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జునపేట 5లైన్‌కు చెందిన ఆవులమంద శ్రీనివాసరావు (47) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జునపేట 5వ లైనుకు చెందిన ఆవుల మంద శ్రీనివాసరావు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. సుమారు రూ.25 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని భావించి ఇంటిలోని బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య హేమార్చన ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు మీదగా రైళ్ల దారి మళ్లింపు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట - విజయవాడ మధ్యన మూడో రైలు మార్గం నిర్మాణ పనుల కారణంగా పలు రైళ్లను గుంటూరు మీదగా దారి మళ్లించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. నెంబరు. 18519/18520 విశాఖపట్టణం - ఎల్‌టీటీ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని మే 9, 15, 21 తేదీల్లో గుంటూరు, నడికుడిమీదగా దారి మళ్లిస్తామని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. నెంబరు. 18045 షాలిమార్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని మే 2, 3,8, 9, 20,21 తేదీల్లో, నెంబరు. 18046 హైదరాబాద్ - షాలిమార్ రైలుని మే 3,4,9,10, 21, 22 తేదీల్లో, నెంబరు. 12774 సికింద్రాబాద్ - షాలిమార్ రైలుని మే 21 గుంటూరు మీదగా దారి మళ్లించి గమ్యస్థానాలకు చేర్చడం జరుగు తుందన్నారు. అలానే నెంబరు. 11019 సీఎస్‌ఎంటీ - భువనేశ్వర్, నెంబరు. 11020 భువనేశ్వర్ - సీఎస్‌ఎంటీ రైలుని మే 2, 3, 8, 9, 20, 21 తేదీల్లో, నెంబరు. 07225 సికింద్రాబాద్ - షాలిమార్ ప్రత్యేక రైలుని ఈ నెల 29, మే 6, 20 తేదీల్లో, నెంబరు 07226 షాలిమార్ - సికింద్రాబాద్ రైలుని ఈ నెల 30, మే 7, 21 తేదీల్లో, నెంబరు. 22849 షాలిమార్ - సికింద్రాబాద్ రైలుని మే 8న, నెంబరు. 22850 సికింద్రాబాద్ - షాలిమార్ రైలుని మే 10న గుంటూరు మీదగా నడుపుతామన్నారు.

పురుగుమందు తాగి
వివాహిత ఆత్మహత్య



జయశ్రీ (ఫైల్)

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28: పురుగుమందు తాగి వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని గొట్టిపాడులో జరిగింది. తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన జయశ్రీ(30)కి గొట్టిపాడు చెందిన శివరామకృష్ణతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇరువురు పిల్లలు ఉన్నారు. ఇంట్లో పిల్లలు అన్నం తినకుండా మారం చేస్తుండగా పెద్దల మధ్య ఆ విషయంలో చిన్నపాటి గొడవ జరిగింది. భర్త కూడా తల్లిదండ్రులనే సమర్థించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన జయశ్రీ శనివారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో పురుగుమందు తాగింది. దీనిని గమనించిన భర్త శివరామకృష్ణ వెంటనే గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది. ఈ మేరకు తల్లి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు.

ముస్లిం ఓట్లతో గెలిచి.. జగన్ వెన్నుపోటు

- మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఫీ

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం ఓట్లతో గెలిచి తిరిగి, ముస్లింలను వెన్నుపోటు పొడిచిన ముఖ్యమంత్రి జగన్ అని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ ఆరోపించారు. ఆదివారం గుంటూరులో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం రావడానికి 90 శాతం ముస్లింలు వైసీపీకి ఓటు వేయడం వలన అసెంబ్లీకి 151 స్థానాలు, లోక్‌సభకు 22 స్థానాలు రావడానికి చాలా దోహద పడ్డాయన్నారు. రాష్ట్రంలో ముస్లిం ఓట్లతో గెలిచి కేంద్రంలో ఉన్న బీజేపీతో కలసి ముస్లిం వ్యతిరేక చట్టాలైన సి.ఎ.ఎ, త్రిబుల్ తలాక్ రద్దు చట్టాలకు మద్దతు ఇస్తూ ముస్లింలను జగన్ ప్రభుత్వం మోసగించిందన్నారు. 2014 ఎన్‌డీఏతో కలసి ఉన్న టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఎక్కడా కూడా ముస్లిం హక్కులకు భంగం కలిగించలేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ముస్లిం వ్యతిరేక బిల్లులకు, చట్టాలకు చంద్రబాబు నాయుడు ఎక్కడా మద్దతు తెలపలేదన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ముస్లింలు జగన్‌కి తగిన బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00



చీరాల గోవర్ధనరెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే చీరాల

బాపట్ల, ఏప్రిల్ 28: మాజీ ఎమ్మెల్యే, వైసీపీనాయకులు చీరాల గోవర్ధనరెడ్డి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరు జిల్లా కొవ్వూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 1964వ సంవత్సరంలో కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామసర్పంచ్‌గా ఎన్నికైన చీరాల గోవర్ధనరెడ్డి 1989 వరకు సర్పంచ్‌గా ఎన్నికవుతూ వచ్చారు. 1967లో కోన ప్రభాకరరావుకు మద్దతునిచ్చారు. 1983లో తెలుగుదేశంపార్టీలో చేరారు. 1985లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. 1989లో కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో తెలుగుదేశం అభ్యర్థికి మద్దతు తెలిపారు. 1999లో మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. 2004 సంవత్సరంలో కాంగ్రెస్‌పార్టీకి మద్దతు తెలియజేసి గాదె వెంకటరెడ్డి విజయానికి కృషి చేశారు. 2009లో తెలుగుదేశంపార్టీ టిక్కెట్టు కేటాయించినప్పటికి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీలో చేరి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి తనకు సముచిత స్థానం కల్పించకపోవటం, కనీసం పార్టీ కార్యక్రమాలకు కూడా పిలవకపోవటం వంటి చర్యలకు పాల్పడటంతో మనస్థాపానికి గురైనట్లు ఆయన తెలిపారు. తెలుగుదేశం అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆయనను కలిసి మద్దతు తెలియజేయాలని కోరటంతో టీడీపీలో చేరాలని నిర్ణయించుకొని నెల్లూరు జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబును కలిసి ఆపార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్, పార్లమెంట్ పరిశీలకులు బాచిన చెంచు గరటయ్య, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, సీనియర్ నాయకులు పమిడి భాస్కరరావు తదితరులు ఉన్నారు. అనంతరం తాడేపల్లిలో యువనేత, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

అమరావతే ఆంధ్రుల రాజధాని

- 1594వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్28: రాష్ట్ర రాజధాని కోసం 33వేల ఎకరాల భూములను ఇస్తే సీఎం జగన్‌రెడ్డి తమను రోడ్డు పాలు జేశాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతుల రైతు కూలీలు మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్ష లు ఆదివారం నాటికి 1594వ రోజుకు చేరకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సీఎం జగన్ అండ్ కో స్వార్థ ప్రయోజనాల కోసం విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామని చెప్పటం సిగ్గుచేటన్నారు. మూడు రాజధానులు కావాలని ఎవరూ అడగలేన్నారు. ఉన్న రాజధానిని అభివృద్ధి చేయకుండా మూడు రాజధానులని ఐదేళ్లనుంచి ప్రజలను మభ్య పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ కక్షలు పక్కనపెట్టి అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు, దీక్షలు కొనసాగాయి.

పవర్ లిఫ్టింగ్ జిల్లా జట్టుకు 14 మంది ఎంపిక

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 28: గుంటూరు జిల్లా సబ్‌జూనియర్, జూనియర్ పురుషుల, మహిళల క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ఆదివారం మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్‌లో నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం 30 మంది లిఫ్టర్లు పాల్గొనగా, 14 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలియజేశారు. సబ్‌జూనియర్ మహిళల విభాగంలో ఈఎల్ వినయ్‌శ్రీ, పురుషుల విభాగంలో ఆర్.నితిన్, జూనియర్ మహిళల విభాగంలో ఎం.షానూన్, ఎన్.జ్ఞానదివ్య, జూనియర్ పురుషుల విభాగంలో పీ.చంగిస్ ఖాన్, హెచ్.రమేష్‌శర్మ, వై.హర్షవర్ధన్, ఎస్.కౌషిక్, ఆర్.లలిత్ శశాంక్, పీ.పృథ్వీకుమార్, పీ.దేవేందర్‌రెడ్డి, ఎ.రామకృష్ణ, కే.శ్రీకాంత్, బి.విజయ్‌తేజ ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు మే 5న విశాఖపట్నంలో జరిగే ఏపీ పవర్ లిఫ్టింగ్ సబ్‌జూనియర్, జూనియర్ క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లను పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ఎస్.వంశీకృష్ణ, జీ.వెంకటేశ్వరరావు, పీ.భాస్కరరావు, బి.చంద్రిక, బి.ప్రసాద్, ఘట్టమనేని సాయిరేవతి, మస్తాన్‌వలి, జీ.శిరీష, ఆళ్ల పవన్‌కుమార్, షేక్ సుభానీ, జీ.మల్లేశ్వరరావు, పీ.సందీప్, కే.మధుబాబు తదితరులు అభినందించారు.



జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


పార్టీలో చేరినవారితో నసీర్, నంబూరు సుభాని తదితరులు

టీడీపీలో ప్రతీ కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు

● తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో ప్రతి కార్యకర్తకు, నాయకుడికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని మొహమ్మద్ నసీర్ భరోసా ఇచ్చారు. 5, 12, 14 డివిజన్లలో లాలాపేట వలి, మిత్రబృందం, ఎల్ఆర్కాలనీ వైసీపీ సీనియర్ నాయకురాలు రహిమునిసా, పలువురు వైసీపీ కార్యకర్తలు, నాయకులు, లాంచెస్టర్ రోడ్డులో జిలాని, మిత్రబృందం, రామిరెడ్డితోటలో జానీ, మిత్రబృందం 1500 వైసీపీ కుటుంబాలు, కార్యకర్తలు, నాయకులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో భారీగా చేరారు. నసీర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కుటుంబంలో ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని భరోసా కలిగించారు. వైసీపీ నాయకులు గత ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేశారని కానీ రాబోయే ఎన్నికలలో ప్రజలు మళ్లీ మాయ మాటలు విని మోసపోవడానికి సిద్ధంగా లేరని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, భరత్ రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు.


ప్రజాదీవెన యాత్రలో ప్రజలతో మాట్లాడుతున్న నసీర్

నసీర్ ఆధ్వర్యంలో 11వరోజు ప్రజాదీవెన యాత్ర

ఎన్నికల ప్రచారంలో భాగంగా నసీర్ చేపట్టిన ప్రజా దీవెన యాత్ర 11వ రోజు మూడో డివిజన్ లక్ష్మీనగర్, కృష్ణనగర్లలో కొనసాగింది. ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ నసీర్ పర్యటన కొనసాగించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న జగన్ మోహన్రెడ్డి చేతకానితనంతో పెన్షన్లు ఇవ్వలేక చంద్రబాబు నాయుడు మీద మాట్లాడుతున్నాడని అన్నారు. పెన్షన్ను రూ.3 వేలు చేస్తానని చెప్పి విడతల వారీగా పెంచడానికి 5 సంవత్సరాలు పట్టిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేల పెన్షన్ పెంచి ఇంటి వద్దకే తెచ్చి ఇస్తామన్నారు.

వేసవి అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 28 : శ్రీ మాజేటి గురవయ్య హైస్కూల్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అరండల్పేట లోని పిచ్చుకలగుంట క్రీడా మైదానంలో వేసవి అథ్లెటిక్స్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన కార్యదర్శి మాజేటి రాంప్రసాద్, ప్రధానోపాధ్యాయు రాలు శారదాదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బోసుబాబు, జిల్లా అథ్లెటిక్స్ సంఘ ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు, కన్నా విద్యా సంస్థల అధినేత కన్నా మాస్టారు ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు వేసవి సమయాన్ని క్రీడల కొరకు ఉపయోగించుకోవాలని తద్వారా శారీరక దారుఢ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఉచిత శిబిరంతో పాటు, క్రీడా కారులకు పౌష్టికాహారాన్ని అందజేయనున్నట్టు తెలిపారు. దాదాపు 60 మంది బాల, బాలికలు ఈ శిక్షణ శిబిరంలో 40 రోజులు పాటు శిక్షణ పొందనున్నారని, అథ్లెటిక్స్తో పాటు అండర్ 14 బాల బాలికలకు ఫిట్నెస్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు పరమహంస, ప్రభాకర్, వెంకటేశ్వరరెడ్డి, కోచ్లు భాస్కర్, కేవీ శంకరరావు, సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారులు కిషోర్ రవి, కృష్ణ, ప్రవీణ, వెంకటేశ్వరమ్మ, పీడీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


శిబిరానికి హాజరైన క్రీడాకారులు, పాల్గొన్న కోచ్లు

దుకాణాలను కూలగొట్టించిన కార్పొరేటర్పై చర్యలు తీసుకోవాలి

గుంటూరు, ఏప్రిల్ 28: ఏటి అగ్రహారం పదో లైను వద్ద పేద దళిత మహిళలు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను కూలగొట్టించిన 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి వి.ముత్తయ్య డిమాండ్ చేశారు. ఏటి అగ్రహారంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఏడు దశాబ్దాలుగా రోడ్డు పక్కన దుకాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్న పేద దళిత మహిళల దుకాణాలు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. ఆ స్థలాన్ని కబ్జా చేయాలనే కుట్రతోనే దుకాణాలను కూల్చివేయించారని ఆరోపించారు. కార్పొరేటర్ వెంకటరెడ్డిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, భారత్ బచావో జిల్లా నాయకులు సమత, పలువురు బాధిత మహిళలు ఉన్నారు.


విలేకరుల సమావేశంలో బాధిత మహిళలతో విల్సన్, ముత్తయ్య తదితరులు

శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారికి లక్ష మల్లెపూలతో పూజ

గుంటూరు, ఏప్రిల్ 28: శారదాకాలనీ 27వ లైనులో ఉన్న శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం లక్ష మల్లె పూలతో పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే సుప్రభాత సేవతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దంపతులతో సామూహిక వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రావి వెంకటరత్నం, కార్యదర్శి దుగ్గినేని మహాలక్ష్మయ్య, కోశాధికారి గొడుగులూరి సుబ్బారావు తదితరులున్నారు.


శ్రీ మహాలక్ష్మమ్మకు లక్ష మల్లెపూలతో అర్చన


సామూహిక వ్రతాలలో పాల్గొన్న దంపతులు

మీ ఆస్తుల చిట్టా ప్రజలకు కూడా చెప్పండి

● విడదల రజిని అఫిడవిట్పై పెమ్మసాని చురకలు
● కాపు హాస్టల్, కల్యాణ మండపం బాధ్యత మాది
● ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మంత్రి విడదల రజిని ఆస్తుల చిట్టా ఏంటో పశ్చిమ ప్రజలకు చెబితే వారు కూడా కోటీశ్వరులు అవుతారు కదా అంటూ పెమ్మసాని చంద్రశేఖర్ చమత్కరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 18, 19, 20, 22 డివిజన్లో పెమ్మసానితో పాటు పలువురు టీడీపీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలను పెమ్మసాని అడిగి తెలుసుకున్నారు. మూడు, నాలుగు దశాబ్దాలకు పైగా స్థానికంగా నివసిస్తున్న తమకు ఇళ్ల పట్టాలు లేవని, నీటి, డ్రైనేజీ సమస్యలను ఎన్నిసార్లు అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు పెమ్మసానికి ఏకరువు పెట్టారు. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. వైసీపీ పశ్చిమ అభ్యర్థి విడదల రజిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇటీవల సమర్పించిన అఫిడవిట్ గురించి ప్రస్తావిస్తూ ఆమె తన అఫిడవిట్లో అందజేసిన వివరాల ప్రకారం 2019కి ముందు ఆదాయం లేదని, అనంతరం రూ.25 లక్షల ఆదాయం ఉన్నట్లు చూపించారని వివరించారు. అయితే ఆస్తులు మాత్రం రూ.18.7 కోట్లు ఉన్నట్లుగా చూపించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని పేద ప్రజలకు ఆస్తుల చిట్టా ఏంటో చెబితే ప్రజలందరూ కోటీశ్వరులు అవుతారు కదా అని ఆయన చమత్కరించారు. కాపు సామాజిక వర్గానికి సంబంధించిన హాస్టల్, కల్యాణ మండపం నిర్మాణ బాధ్యతలు తాము చూసుకుంటామని భరోసా ఇచ్చారు. గళ్లా మాధవి మాట్లాడుతూ నిజమైన సంక్షేమం ఎలా ఉంటుందో టీడీపీ ప్రభుత్వం ద్వారా తెలుస్తుందన్నారు. టీడీపీకి ఓటు వేస్తే పథకాలు రద్దు చేస్తాం, పట్టాలు రద్దు చేస్తామంటూ బెదిరించే వాళ్ళకి చెంప పెట్టులా మీ ఓటుతో సమాధానం చెప్పండి అంటూ ఆమె పిలుపునిచ్చారు. మల్లెల రాజేశ్ నాయుడు మాట్లాడుతూ ఎలాగూ ఓడిపోతారనే నమ్మకంతో, ఎక్కడైతే ఏంటి అనుకుని రజినిని జగన్ గుంటూరు పంపించారన్నారు. ప్రశాంతంగా ఉండే చిలకలూరిపేటలో నాలుగున్నరేళ్ళుగా రజని కుటుంబం చేసిన అవినీతి అంతా ఇంతా కాదన్నారు.


గజమాలతో పెమ్మసాని, మాధవికి స్వాగతం పలుకుతున్న ప్రజలు


ప్రజలకు అభివాదం చేస్తున్న పెమ్మసాని, గళ్లా మాధవి, కన్నా

ముస్లింలకు ఖబర్ స్థాన్ కోసం రెండు ఎకరాలు కేటాయిస్తానని చెప్పి రూ.కోటిన్నర తీసుకుని ముప్పతిప్పలు పెట్టిందన్నారు. పర్యటనలో సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర వర్మ, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస యాదవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా వైస్ ప్రెసిడెంట్ అడపా మాణిక్యం, ముజీబ్ తదితర టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు

మెడికల్ ఇన్సూరెన్సుకు కృషి చేస్తా : పెమ్మసాని

మెడికల్ సిబ్బందికి ప్రధాన సమస్యగా ఉన్న మెడికల్ ఇన్సూరెన్సు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని ఏ కన్వెన్షన్లో ఆదివారం జరిగిన పారామెడికల్ సిబ్బంది ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయనతోపాటు గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్ సమావేశానికి హాజరయ్యారు. పెమ్మసాని మాట్లాడుతూ కరోనా సమయంలో కన్న బిడ్డల్ని సైతం వదిలి వైద్యం అందించిన వైద్య సిబ్బందికి వందనాలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్యులు, సిబ్బంది పైన దాడులు బాగా పెరిగాయని, భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మాధవి మాట్లాడుతూ పారా మెడికల్ సిబ్బంది అంటేనే కనిపించని హీరోలు అన్నారు. ఓటు అడగడానికి వచ్చిన నాయకులను మీకే ఎందుకు ఓటేయాలని ఓటర్లు ప్రశ్నించిన నాడే నాయకుల్లో చలనం కలుగుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, బీసీ నాయకుడు నిమ్మల శేషయ్య పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అండగా ఉంటా..

బ్రాహ్మణులకు అన్నివిధాలా అండగా వుంటానని పెమ్మసాని భరోసా ఇచ్చారు. గ్రంధి సీతారామయ్యకల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఆయనతోపాటు గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్ పాల్గొన్నారు.

సైకిల్ స్పీడుకి ఫ్యాన్ రెక్కలు విరగటం ఖాయం

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గళ్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్లో టీడీపీ సైకిల్ స్పీడుకి వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరగటం ఖాయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ- జనసేన-బీజేపీ అభ్యర్థి గళ్లా మాధవి అన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ 'సైకిల్ ఫిట్నెస్ గ్రూప్స్' ఆధ్వర్యంలో 'సమరానికి సైకిల్ యాత్ర' పేరుతో చేపట్టిన సైకిల్ యాత్రలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ద్విచక్ర వాహనంపై వారితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అభిమానులను ఉత్సాహపరిచారు. గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి మొదలయిన సైకిల్ ర్యాలీ పట్టాభిపురం మీదుగా శంకర్ విలాస్ బ్రిడ్జి, లాడ్జిసెంటర్ మీదుగా గుజ్జనగుండ్లకు చేరుకుంది.


సైకిల్ యాత్రలో పాల్గొన్న గళ్లా మాధవి తదితరులు

గళ్లా మాధవి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వలంటీర్లు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి రోజు వైసీపీకి వరస షాకులు తగులుతున్నాయి. మొన్న ద్వితీయ శ్రేణి నాయకులు, నిన్న వైసీపీ కార్పొరేటర్లు, నేడు వలంటీర్లు టీడీపీలో చేరి అధికార వైసీపీకి షాక్ మీద షాక్ ఇస్తున్నారు. జగన్రెడ్డి వలంటీర్లకు రూ.5 వేలు ఇచ్చి ఇష్టానుసారం పని చేయించేవాడని, కానీ తమ కష్టాన్ని గుర్తించి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే నెలకు రూ.10వేలు ఇస్తామని ప్రకటించారని, అది తమను ఎంతో ఆకర్షించిందని వలంటీర్లు చెప్పారు. వలంటీర్లుగా ఉండి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదన్న నిబంధనలతో తాము రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు వలంటీర్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిని ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గళ్లా మాధవి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గళ్లా మాధవి మాట్లాడుతూ త్వరలో గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలో వైసీపీ మనుగడ కోల్పోతుందని, వైసీపీ నాయకత్వంలో పని చేసేందుకు ఎవరూ ముందుకు రావటం లేదని, రేపు వైసీపీకి బూత్ ఏజంట్లు కూడా ఉండరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని మాధవి అన్నారు. వారితోపాటు పార్టీలో చేరిన వారిలో షేక్ ఖాదర్ బాషా, నిమ్మల ప్రశాంత్ కుమార్, డేగల శ్రీను, బైరబోయిన వెంకటేష్, షేక్ ఖాసీంవలి, చైతన్య, మోహనకృష్ణతో పాటు ముదిరాజు, మైనారిటీ, కాపు, రెడ్డి, నాయీబ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన 600 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు.


పార్టీలోకి చేరినవారిని ఆహ్వానిస్తున్న గళ్లా మాధవి, మొహమ్మద్ షరీఫ్

రాష్ట్రంలో సుపరిపాలన అందించే నేత చంద్రబాబు

● శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్

రాష్ట్రంలో సుపరిపాలన అందించగలిగే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అన్న నమ్మకం వల్లే టీడీపీలోకి వలసలు పెరుగుతున్నాయని శాసనమండలి మాజీ చైర్మన్ మొహమ్మద్ షరీఫ్ అన్నారు. గుంటూరు 21వ డివిజన్ యతిరాజు నగర్లో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గళ్లా మాధవి మాట్లాడుతూ ముస్లింలు వెనుకబడటానికి ప్రధాన కారణం ఆర్థిక లేమి అని, వారి అవసరాలకు మాత్రమే సరిపోయే డబ్బు వారిని ఉన్నత స్థానంలో నిలపలేకపోతోందన్న భావనతో అధికారంలోకి వచ్చిన వెంటనే తాను 'నాన్ ప్రాఫిటబుల్ అసెట్' క్రింద ఇంగ్లీష్ మీడియం స్కూల్ను గుంటూరు పశ్చిమలో నిర్మిస్తామని గళ్లా మాధవి హామీనిచ్చారు. 34వ డివిజన్ కోబాల్ట్పేటకు చెందిన జక్కి వెంకట్, దగ్గు కిరణ్ ఆధ్వర్యంలో జక్కి జయశ్రీ, మాలపాటి రవి, బుస్సా పార్వతి, రాపర్ల అంజమ్మ, ఊదర ఏడుకొండలతో పాటు 100 మంది ఆదివారం టీడీపీలో చేరారు. ఎన్నికల ప్రచారం నేపథ్యంలో గుంటూరు విద్యానగర్లో నివాసం ఉన్న బిషప్ గాలిబాలిని ఆదివారం కలిసిన గళ్లా మాధవి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

ఇండియా కూటమితోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

● ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్కుమార్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 28 : ఇండియా కూటమితోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధ్యమవుతాయని గుంటూరు పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ అన్నారు. ప్రచారంలో భాగంగా ఆదివారం పశ్చిమ అభ్యర్థి డాక్టర్ రాచకొండ జాన్బాబు, ఇతర కూటమి నాయకులతో కలిసి నగరంలోని ఆశోక్నగర్, లక్ష్మీపురం, బృందావన్గార్డెన్స్ కృష్ణనగర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి విజయానికి సహకరించాలని స్థానికులకు జంగాల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు, అకిటి అరుణ్కుమార్, నాసర్జీ, రావుల అంజిబాబు, నళినికాంత్, కే.శ్రీనివాసరావు, కొల్లి రంగారెడ్డి, రత్నం, కట్టా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

● ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అభ్యర్థి సేవకుమార్

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 28: గుంటూరు పశ్చిమ నియోజవర్గం ఓటర్లు తనను గెలిపించి అసెంబ్లీకి పంపితే ఈ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ అభ్యర్థి డాక్టర్ తాతా సేవకుమార్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం తన మద్దతుదారులతో కలసి ఆయన బృందావన్ గార్డెన్స్, చంద్రమౌళీ నగర్, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. పాలకుల్లో చిత్తశుద్ధి లేకపోవడమే ప్రజా సమస్యల పరిష్కారం కావడం లేదని సేవకుమార్ విమర్శించారు. తనను గెలిపిస్తే చిత్తశుద్ధితో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, విద్య, వైద్య సదుపాయాలపై దృష్టి పెడతానని డాక్టర్ సేవకుమార్ వెల్లడించారు.కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ అధ్యక్షుడు పెళ్లకూరు సురేందర్రెడ్డి, రమణబాబు, గడల శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఒకటిన సోమేపల్లి జయంతి సందర్భంగా కవి సమ్మేళనం

గుంటూరు, ఏప్రిల్ 28 : ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మే 1న ఉదయం 10 గంటలకు సోమేపల్లి వెంకట సుబ్బయ్య జయంతి వేడుకలు బృందావన్గార్డెన్స్ 5వ లైన్లోని అన్నమయ్య గ్రంథాలయ ప్రాంగణంలో జరుగుతాయని జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రధాన వక్తలుగా ప్రముఖ సాహితీ వేత్త తోటకూర వెంకటనారాయణ, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, గౌరవ అతిథిగా వేంకటేశ్వర దేవస్థానం అధ్యక్షుడు మస్తానయ్య పాల్గొంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులుగా తెలుగు సాహితీ రంగంలో సోమేపల్లి చేసిన కృషిని స్మరించుకోవటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో నగరంలోని సాహితీ మిత్రులు, కవులు, కవయిత్రులు, రచయితలు తప్పకుండా పాల్గొని ఒక కవితో.. రెండు మాటల్లో సోమేపల్లి వారిపై మీ హృదయ స్పందనను తెలియచేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. శర్మ సిహెచ్, ఎస్ఎం సుభాని కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.భవాని దేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, ఉపాధ్యక్షులు బి.ఉమామహేశ్వరరెడ్డి, కోశాధికారి నానా పర్యవేక్షిస్తారన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ గుంటూరు- 2 డీఎం

గుంటూరు, ఏప్రిల్ 28 : ఆర్టీసీ పరమైన సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ గుంటూరు-2 డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-హైదరాబాద్, గుంటూరు-తెనాలి, గుంటూరు-విజయవాడ, గుంటూరు - విశాఖపట్నం రూట్లలో ఆర్టీసీ బస్సులు, సమస్యలతో పాటు సిబ్బంది పనితీరు, సలహాలు, సూచనలతో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959225421కు ఫోన్ చేయాలని కోరారు.

యార్డు చైర్మన్ పదవులు అమ్ముకున్నోళ్లు అభ్యర్థులా?

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నమ్ముకున్న పార్టీ కోసం రక్తం ధారబోసి, నిస్వార్థంగా సేవ చేసే కార్యకర్తలకు దక్కాల్సిన యార్డు చైర్మన్, ఎంపీపీ, జట్పీటీసీ పదవులను కూడా డబ్బుకు అమ్ముకున్న ఘన చరిత్ర కలిగిన వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి రోశయ్య, విడదల రజిని ప్రజలకు ఏం సేవ చేస్తారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రశ్నించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొన్నూరు, చిలకలూరిపేటలో వైసీపీ నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు సమావేశాలు ఏర్పాటు చేసి మరీ వీరి అవినీతిని ఎండగట్టారని కనపర్తి గుర్తు చేశారు. కిలారు మామ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును తెలుగుదేశం పార్టీ కేంద్ర మంత్రిని చేస్తే ఆయన స్వలాభం కోసం పార్టీకి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. మంత్రి రజిని మామ విడదల లక్ష్మీనారాయణ చిలకలూరిపేట యార్డు చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో తలకిందులుగా తపస్సు చేసినా ఇవ్వలేదని, టీడీపీలో చేరిన వెంటనే ఆయనకు యార్డు చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. నిధుల లేమితో పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలను తాను సొంత నిధులతో పరిష్కరిస్తామని ధైర్యంగా చెబుతున్న పెమ్మసాని, మాధవిని గెలిపించాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని ఆయన అన్నారు. మంత్రిగా పుల్లారావు 4,200 కోట్లతో చిలకలూరిపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే, రజిని మంత్రి కాగానే వేల కోట్ల అవినీతికి పాల్పడిందని ధ్వజమెత్తారు. అవినీతిలో ఆంధ్ర శశికళగా పేరు గాంచిన మంత్రి విడదల రజినీని పశ్చిమ ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. నిజాయితీగా పని చేస్తే ఆమె ఇక్కడకు రావాల్సిన పనేంటని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో బీసీ బిడ్డనని ఊదర గొట్టిన రజిని, నేడు ఆ ప్రస్తావన ఎందుకు తేవటంలేదో సమాధానం చెప్పాలని కనపర్తి డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో వైసీపీ పాలనను అంతమొందిద్దాం!

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్


డేగల ప్రభాకర్

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందిద్దామని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ పిలుపునిచ్చారు. టీడీపీ నగర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.10 లక్షల భారం మోపిన ఘనత సీఎం జగన్కే దక్కిందన్నారు. ల్యాండ్, ఇసుక, మైనింగ్, గంజాయి, డ్రగ్స్తోపాటు రేషన్ బియ్యంలో లక్షల కోట్లు వైసీపీ కొట్టేసిందని ఆరోపించారు. కల్తీ మద్యాన్ని విక్రయించి రాష్ట్రంలో లక్షల మంది ఆరోగ్యాలను పాడు చేసి 30 వేల మంది మహిళల తాళిబొట్లను వైసీపీ పాలకులు తెంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరాచక పాలనను అంతమొందించ టానికే కూటమి ఏర్పడిందన్నారు. ఈసారి ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం, సైకో జగన్రెడ్డి ఇంటికిపోవడం ఖాయమని అన్నారు. సూపర్ సిక్స్ ముందు జగన్ మేనిఫెస్టో వెలవెలబోయిందని, అందులో అసలేమైనా ఉందా అని ప్రశ్నించారు. యువతకు, రైతులకు, మహిళలకు ఏమైనా భరోసా ఇచ్చాడా అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్సిక్స్ పథకాలను ప్రజలకు అందిస్తామ న్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలో విధ్వంస పాలన కొనసాగించిన సీఎం జగన్ను ఎన్నికల్లో తరిమికొట్టాలన్నారు.

మసీదులో ఎమ్మెల్యే ముస్తఫా ఎన్నికల ప్రచారం

● కలెక్టర్కు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నగరంలోని ఒక మసీదులో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా ఎన్నికల ప్రచారం నిర్వహించారని టీడీపీ నాయకులు జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. అందుకు తగిన ఆధారాలను ఆయనకు అందజేశారు. ఆదివారం మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు కలెక్టరేట్కు వచ్చి జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాలరెడ్డిని కలిసి అధికార వైసీపీ ఎన్నికల కోడ్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నదని ఫిర్యాదు చేశారు. ప్రార్థన మందిరాల్లో ప్రచారం నిర్వహించకూడదన్న నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు ఎమ్మెల్యే ముస్తఫాపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలానే మిర్చియార్డులో ఖాదర్బాషా అనే డీఈవో ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ వైసీపీకి అనుకూలంగా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. తెనాలి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని వైసీపీ కార్యాలయంగా అక్కడి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మార్చారని, ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. వీటన్నింటిపై తాను విచారణ జరిపి చర్యలు తీసుకొంటానని కలెక్టర్ చెప్పారని రామకృష్ణ, మన్నవ తెలిపారు. కలెక్టర్ని కలిసిన వారిలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి శ్రీరామ్ రాజీవ్ ఆనంద్ ఉన్నారు.


జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మన్నవ

వైసీపీ ఓటమి ఖాయం : తాడిశెట్టి

గుంటూరు, ఏప్రిల్ 28 : వచ్చే ఎన్నికల్లో ప్రజల చేతుల్లో వైసీపీ ఓటమి ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ స్పష్టం చేశారు. యనమదలలో 100 కుటుంబాలు, పొత్తూరులో మరో 50 కుటుంబాలు, సీఆర్ నగర్లో 50 కుటుంబాలు, దాసరిపాలెంలో 100 కుటుంబాలు, ఓబుల్ నాయుడుపాలెంలో 55 కుటుంబాలు తాడిశెట్టి మురళీ సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికి మురళీ కండువాలతో టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తాడిశెట్టి మురళీ మాట్లాడుతూ టీడీపీలో చేరికలు వైసీపీ అభ్యర్థుల గుండెల్లో గుబులు రేకెత్తిస్తున్నాయన్నారు. టీడీపీ కూటమి గెలుపు కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చైతన్యవంతులైన ప్రజలు అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధమయ్యారన్నారు. ఇటీవల టీడీపీలో చేరికలే ఎన్డీఏ కూటమి విజయాన్ని తెలియజేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టి బాజీ, శ్యామ్బాబు, జ్యోతిరాజు, నాగరాజకుమారి, కోటేశ్వరరావు తదితరులున్నారు.


తాడిశెట్టి మురళీ సమక్షంలో టీడీపీలో చేరిన పలువురు కార్యకర్తలు


కార్మికుల హక్కుల రక్షణ దినంగా మేడేను జరుపుకోవాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 28: ప్రపంచ కార్మిక పర్వదినం మేడే సందర్భంగా జిల్లాలో వాడవాడలా అరుణ పతాకాలను ఆవిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికుల రక్తంతో తడిచిన ఎర్రజెండా పోరాటాలకు గుర్తుగా మేడే రోజు ప్రపంచవ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు జరుగుతున్నాయన్నారు. కార్మిక వర్గం తమ హక్కుల రక్షణకు దీక్షా దినంగా మేడేను జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఫోన్ చేసి.. ప్రలోభాలు

- సరికొత్తగా వైసీపీ ఓట్ల వేట
- నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా కాల్ సెంటర్లు
- సిబ్బందితో ఫోన్ చేసి.. రాత్రికి ఇళ్లల్లో వాలి బేరసారాలు
- అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నేతలకు పార్టీ పెద్దల సూచన



వినియోగదారుల కోసం కంపెనీలు ప్రత్యేకంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని సేవలు అందిస్తుంటాయి. ఇదే రీతిలో ప్రస్తుతం ఎన్నికల కాల్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. కొన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ అభ్యర్థులు కాల్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని ఓట్ల వేటకు తెరలేపారు. ఓటర్లకు ఫోన్ చేసి ఏ పార్టీకి ఓటేస్తారు.. మాకెందుకు వేయరు.. అని వివరాలు తెలుసుకుని వారిని సంతృప్తి పరచడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమకు ఓటు వేసేవారైతే సరే.. లేదంటే వారిని లొంగతీసుకునేందుకు ప్రలోభాలకు తెరలేపారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో కాల్ సెంటర్ల కార్యకలాపాలు ముమ్మరమయ్యాయి. ఈ కాల్ సెంటర్ల ద్వారా ఫోన్లు ఒక్క ఓటర్లకే కాదు ఆ జాబితాలో ద్వితీయ శ్రేణి నాయకులు ఉండటం కూడా గమనార్హం. ప్రధానంగా టీడీపీ సానుభూతిపరులను ప్రసన్నం చేసుకోవడంపైనే కాల్ సెంటర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారని సమాచారం.

బాపట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసేందుకు, ఓటర్లను లోబర్చుకునేందుకు అధికార పార్టీ అభ్యర్థులు సరికొత్త విన్యాసాలకు శ్రీకారం చుడుతున్నారు. ఏకంగా తమ సిబ్బంది చేత ఓ కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి ఓటర్లకు ఫోన్లు చేయిస్తున్నారు. ఓటర్లకు ఫోన్ చేయించడం, వారి నుంచి అభిప్రాయం తీసుకోవడం, రాత్రి వేళల్లో వారి ఇళ్ల దగ్గర వాలిపోవడం.. ప్రలోభాలకు గురి చేయడం.. ఇలా వైసీపీ నేతల ఓట్ల క్రీడకు శ్రీకారం చుట్టారు. ఫోన్ ద్వారా వివరాలు రాబట్టి బేరసారాలకు దిగుతున్నారు. ఓ విధంగా ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే. కానీ ఎక్కడా ఇది బయటకు రాకుండా కేవలం ఫోన్‌లో ఓటరు అభిప్రాయ సేకరణ అనే కలరింగ్ ఇచ్చి ఓట్ల కొనుగోలుకు తెరలేపుతున్నారు. దీనికి మొత్తానికి నియోజకవర్గానికి 20 మంది సిబ్బంది చేత ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి మరీ వైసీపీ ఓట్ల కుట్రలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

అభిప్రాయ సేకరణ అంటూ..

నియోజకవర్గంలోని సదరు నేత కార్యాలయం వద్ద నుంచి ఫోన్ అంటే వాస్తవ ఫీడ్ బ్యాక్ రాదనే ఉద్దేశంతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటరును అభిప్రాయం అడిగేలా వైసీపీ నేతలు ప్రణాళికలు రచించారు. ఓటు వైసీపీకే వేస్తారుగా అని మొదలుపెట్టి కాదంటే ఎందుకు అనే కోణంలో ఆరా తీసి వారిని ప్రలోభ పరిచే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ మొత్తం ప్రక్రియ ఆయా నియోజకవర్గాల్లోని వైసీపీ అభ్యర్థుల కనుసన్నల్లో జరగడం గమనార్హం. నిత్యం ప్రచారంలో వైసీపీ నేతల వెంబడి తిరిగే ద్వితీయశ్రేణి నేతలు కూడా ఈ ఫోన్ కాల్ వలలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ అనగానే స్థానికంగా ఉన్న పరిస్థితి.. తమ అసంతృప్తికి కారణం.. తదితరాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని చెబుతున్నారు. ఈక్రమంలో పొద్దున లేస్తే పక్కన తిరిగే వైసీపీ ద్వితీయశ్రేణి నేతలు కూడా పార్టీకి ఈ సారి ఓటు వేయబోం అని చెబుతుండేసరికి అవాక్కవడం అభ్యర్థుల వంతవుతోంది. వారిని ప్రసన్నం చేసుకోవడానికి పెద్దఎత్తున బేరసారాల ప్రక్రియకు తెరలేపుతుండడం గమనార్హం.

నిబంధనల అతిక్రమణలివే...

ఎన్నికల వేళ రహస్యంగా ఓ 20 మందితో కాల్ సెంటర్ తరహాలో ఏర్పాట్లు చేసుకుని ఓటర్లకు ఫోన్ చేసి ప్రలోభపెట్టడం కోడ్ అతిక్రమణే. ఇక ముఖ్యంగా రాత్రి వేళల్లో కీలక నేతలే సదరు ఓటర్ల ఇంటికి వెళ్లి వారికి అవసరమైన ప్రయోజనాల విషయంలో హామీ ఇవ్వడం నిస్సందేహంగా ఎన్నికల్ కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది. కొన్ని అంశాల విషయంలో బహిరంగంగా నిఘా ఉంటే, మరికొన్నింటిలో రహస్యంగా నేతల కదలికలపై నిఘా ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిది. ఫ్లయింగ్ టీం స్క్వాడ్‌లతో పాటు ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్‌లది ఇందులో కీలకపాత్ర. కానీ వారు ఆశించిన స్థాయిలో పని చేయకపోవడంతో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా ప్రలోభాల పర్వానికి తెరలేపుతున్నారన్న విమర్శలున్నాయి

ఓటమి భయంతోనే ఈ తరహా కుట్రలు...

ఓటమి భయంతో వైసీపీ నేతలు, అభ్యర్థులు ఈ తరహా ప్రలోభాల కుట్రలకు తెరలేపి కాల్‌సెంటర్ల ద్వారా ఓటర్లను నయానో, భయానో తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నేరుగా ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. అలాకాకుండా కాల్ సెంటర్ రాజకీయం ద్వారా రాత్రిళ్లు ఓటర్లను కలిసే వికృత రాజకీయానికి తెరలేపడమే అభ్యంతరకరమనే వాదనను టీడీపీ చేస్తోంది. ఇదే విషయం టీడీపీ పెద్దల దృష్టికి వెళ్లడంతో అభ్యర్థులను అప్రమత్తం చేయడంతో పాటు పాలక పార్టీ నేతల కుట్రలపై జాగరుకతతో ఉండాలని హెచ్చరించింది. వైసీపీ అభ్యర్థులు ఓట్ల వేటలో భాగంగా పాల్పడుతున్న అనైతిక కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అభ్యర్థులను పార్టీ పెద్దలు హెచ్చరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రచారం ముమ్మరంగా చేసుకోవడంతో పాటు ప్రత్యర్థులు పాల్పడే కోడ్ ఉల్లంఘనలపై కూడా దృష్టి పెట్టి రుజువులతో ఈసీకి ఫిర్యాదు చేయడమో లేక సంబంధిత ఆర్వో దృష్టికి తీసుకెళ్లడమో చేయాలని సూచించింది.

> **ఫోన్ నెంబర్లు ఎలా చేరాయి?**
>
> నియోజకవర్గాల వారీగా గంపగుత్తగా ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థులకు ఎలా చేరాయి. ఓట్ల కోసం దరఖాస్తులతో పాటు ఇచ్చే ఫోన్ నెంబర్లు ఎన్నికల అధికారుల దగ్గర రహస్యంగా ఉండాలి. అలాంటి నెంబర్లు అధికార పార్టీ వ్యక్తుల వద్దకు చేరడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార కార్యకలాపాల కోసం ఫోన్ నెంబర్లను సేకరించడం, వినియోగదారులను విసిగించడం ఒక విధంగా నేరం. అలాంటిది కాల్ సెంటర్ పెట్టడం, ఫోన్లు చేయడంపై నేరమైనా ఎన్నికల అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గాల్లోని ఓటర్ల ఫోన్ నంబర్లు అందునా టీడీపీ సానుభూతిపరుల ఫోన్ నంబర్లు గంపగుత్తగా వైసీపీ నేతల దగ్గరకు ఎలా వెళ్లాయనే దానికి ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పెరిగిన ఓటర్లు.. 19,521

- మంగళగిరిలో 6 వేల వరకు కొత్త ఓటర్లు
- గుంటూరు తూర్పులో తక్కువగా 1,200 మందికి కొత్తగా ఓటుహక్కు



గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పోలింగ్ తేదీన వినియోగించే ఓటర్ల జాబితాలు విడుదలైన దృష్ట్యా జిల్లాలో కొత్తగా 19,521 మంది ఓటర్లు పెరిగారు. స్పెషల్ సమ్మరి రివిజన్ - 2024లో భాగంగా ఈ ఏడాది జనవరి 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించే నాటికి జిల్లాలో ఓటర్ల సంఖ్య 17,72,022 మంది ఉంటే నేడు ఆ సంఖ్య 17,91,543కి చేరింది. తుది ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి మంగళగిరిలో 2,86,600 మంది ఓటర్లు ఉండగా ఆ సంఖ్య నేడు 2,92,432కి చేరింది. గుంటూరు తూర్పులో 2,49,428 మంది ఉండగా ఆ సంఖ్య 2,50,691కి స్వల్పంగా పెరిగింది. మిగతా నియోజకవర్గాల్లో ఓటర్ల పెరుగుదల సాదారణంగానే ఉన్నది. తాడికొండలో 2,05,188 మంది జనవరి 22వ తేదీ నాటికి ఓటర్లుగా నమోదై ఉండగా ఆ సంఖ్య నేడు 2,07,615కి పెరిగింది. పొన్నూరులో 2,25,864 నుంచి 2,27,135కి, తెనాలిలో 2,64,894 నుంచి 2,67,624కు, ప్రత్తిపాడులో 2,64,519 నుంచి 2,67,888కి, గుంటూరు పశ్చిమలో 2,75,429 నుంచి 2,78,158కి ఓటర్లు పెరిగారు.

- మంగళగిరిలో అతివల ఓట్లే అధికం
- నియోజకవర్గ ఓటర్లు 2,92,432
- పురుషులు 1,40,660.. మహిళలు 1,51,759
- ఓటర్ల తుది జాబితా విడుదల
- జిల్లాలో మంగళగిరి ఓటర్లే అత్యధికం

మంగళగిరి నియోజకవర్గ ఓటర్ల వివరాలు

ప్రాంతం	పోలింగ్ స్టేషన్ల సంఖ్య	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
తాడేపల్లి రూరల్	41	21,061	22,724	1	43786
తాడేపల్లి అర్బన్	48	25,600	27,555	0	53,155
మంగళగిరి రూరల్	77	37,029	40,048	3	77,080
మంగళగిరి అర్బన్	62	32,046	34,604	5	66,655
దుగ్గిరాల	58	24,924	26,828	4	51,756
మొత్తం	286	1,40,660	1,51,759	13	2,92,432



మంగళగిరి పట్టణం ఏరియల్ వ్యూ



ఆమె ఓటే కీలకం

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 28: సార్వత్రిక సమరంలో ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్య లెక్కతేలింది. తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. విభజిత గుంటూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతో పోలిస్తే మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం (2,92,432) లోనే ఓటర్లు అత్యధికంగా వున్నారు. ఆ తరువాతి స్థానాల్లో వరుసగా గుంటూరు పశ్చిమ (2,78,158), ప్రత్తిపాడు (2,67,888), తెనాలి (2,67,624), గుంటూరు తూర్పు (2,50,691), పొన్నూరు (2,27,135), తాడికొండ (2,07,615) వున్నాయి. ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా తరువాత వచ్చిన క్లయిమ్‌లను పరిష్కరించి, కొత్త వారికి ఓటుహక్కు అవకాశం కల్పిస్తూ తుది జాబితాను ఆదివారం విడుదల చేశారు. జనవరిలో విడుదల చేసిన జాబితాతో పోలిస్తే ప్రస్తుత తుది జాబితాలో 3,354 మంది అదనంగా చేరారు. మంగళగిరిలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా వున్నారు. మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి మంగళగిరి రూరల్ మండలంలో అత్యధిక ఓట్లు నమోదు కాగా, తాడేపల్లి రూరల్ మండలంలో అత్యల్పంగా ఓట్లు నమోదయ్యాయి. నియోజకవర్గంలోని తాడేపల్లి అర్బన్, రూరల్, మంగళగిరి అర్బన్, రూరల్, దుగ్గిరాల మండలాల్లో అన్నిచోట్లా పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా వున్నారు. నియోజకవర్గంలో పురుషులు 1,40,660 మంది, మహిళలు 1,51,759 మంది, ఇతరులు 13 మందిని కలుపుకుని మొత్తం 2,92,432 మంది ఓటర్లు వున్నారు. పురుషుల కంటే మహిళలు 11,099 మంది ఎక్కువగా వున్నారు. దీంతో మే 13వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో మహిళల నిర్ణయమే కీలకంగా మారనుంది. అతివల మద్దతు ఎటువైపు మొగ్గుతుందో ఫలితాలు వెల్లడయ్యే వరకు వేచిచూడాల్సిందే!

నేటితో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సంపూర్ణం

గుంటూరు, ఏప్రిల 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం నేటితో సంపూర్ణం కానుంది. ఇప్పటికే ఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అభ్యర్థుల ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేశారు. వాటిని ఈ నెల 26వ తేదీన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని ఆమోదించారు. మిగతావాటిని తిరస్కరించారు. నామినేషన్లు స్వచ్ఛందంగా ఉపసంహరించు కొనేందుకు సోమవారం సాయంత్రం 3 గంటల వరకు సమయం ఉన్నది. గుంటూరు లోక్‌సభ స్థానానికి ఇంకా 34 మంది పోటీలో ఉన్నారు. తాడికొండకు 10, మంగళగిరికి 42, పొన్నూరుకు 14, తెనాలికి 14, ప్రత్తిపాడుకు 13, గుంటూరు పశ్చిమకు 31, గుంటూరు తూర్పునకు 17 మంది బరిలో కొనసాగుతున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాలు విడుదలౌతాయి. అలానే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం కేటాయించిన పార్టీ గుర్తులను ఇస్తారు. ఇండిపెండెంట్‌లు, మిగతా అభ్యర్థులకు ఈసీ అనుమతించిన గుర్తులను కేటాయిస్తారు. అనంతరం బ్యాలెట్ పేపర్ ముద్రణకు పంపుతారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ పూర్తి కాగానే తొలుత పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై అధికారులు దృష్టి సారిస్తారు.

చందా కోసమా.. పద్దులపై చర్చా?

- నేడు అత్యవసరంగా మిర్చి కమీషన్ ఏజంట్ల భేటీ
- ఇప్పటికే ఎలక్షన్ ఫండ్ కోసం వైసీపీ నేతల ఒత్తిళ్లు
- సమావేశంపై కన్నేయాలని నిఘావర్గాలకు ప్రతిపక్షాల సమాచారం

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం అత్యవసరంగా ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ సభ్యులకు సమాచారం అందించారు. లాలుపురం వై జంక్షన్ సమీపంలోని ఓ కోల్డ్‌స్టోరేజ్ ప్రాంగణంలో జరిగే సమావేశానికి ఉదయం 8.30 గంటలకల్లా హాజరు కావాలని సందేశమిచ్చారు. ప్లాట్ల అమ్మకం, ఆగ్రో క్రాప్స్ పద్దులు, వడ్డీలు, ఏసీ ఎగుమతుల పద్దులు తదితరాలపై చర్చించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు నోటీసులో పేర్కొన్నారు. అయితే అధికార వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల కోసం చందాలు వసూలు చేసి ఇచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా ఆయా సంఘాల తరపున దాదాపుగా రూ.కోటి వరకు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ సమావేశంపై వీడియో, స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు, ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా పెట్టాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. గుంటూరు మిర్చియార్డులో జగన్ సామాజికవర్గానికి చెందిన వ్యాపారులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గత రెండు పర్యాయాల నుంచి వైసీపీ అభ్యర్థులకు అసోసియేషన్ తరపున చందాలు వసూలు చేసి పెద్ద మొత్తంలో అందజేస్తున్నారు. ఈ దఫా యార్డు వ్యాపార కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఓ నేత వైసీపీ తరపున ఎన్నికల బరిలో ఉన్నారు. దీంతో ఎలక్షన్ ఫండ్ ఇవ్వాలని కొన్ని రోజులుగా మిర్చి వ్యాపారులపై ఒత్తిళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎగుమతిదారుల సంఘాల నేతలకు వైసీపీ నేతలు ఫోన్లు చేసి ఎలక్షన్ ఫండ్ ఎంతో కొంత ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో లాలుపురం సమీపంలో జరిగే సమావేశంలో ఎన్నికల చందా వసూళ్లపై చర్చించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సమావేశంపై దృష్టి పెట్టడంతో పాటు అసోసియేషన్లలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారి బ్యాంకు లావాదేవీల పైనా ఎన్నికల అధికారులు ఓ కన్నేసి ఉంచాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.



1న చంద్రబాబు ప్రచారం

- చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి
- తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్ పక్కన పెమ్మసాని, నసీర్

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో మే 1న జరిగే చంద్రబాబు ఎన్నికల పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన అధ్యక్షతన చంద్రబాబు పర్యటన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గుంటూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, గుంటూరు తూర్పు అభ్యర్థి మొహమ్మద్ నసీర్, ప్రత్తిపాడు అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, గుంటూరు జిల్లా ఎన్నికల పరిశీలకురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, గల్లా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మే 1న సాయంత్రం 6 గంటలకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో చంద్రబాబు ఎన్నికల ప్రచారం జరగనున్నదని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మన రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, కేసులు, కుట్రలు తప్ప రాష్ట్రంలో అభివృద్ధి లేదన్నారు. ఐదేళ్లకాలంలో దుర్మార్గమైన పాలనను జగన్ రెడ్డి చూపించాడని, శాంతిభద్రతలు పూర్తిగా కనుమరుగయ్యాయని విమర్శించారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడే సమయం వచ్చిందని, తెలుగుదేశం- జనసేన- బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. చంద్రబాబు పర్యటనకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల పర్యటనకు గుంటూరు నగర ప్రజలు భారీగా తరలి రావాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలనలో ప్రజలు తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కార్యక్రమంలో పిల్లి మాణిక్యరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాసరావు, మద్దిరాల ఇమ్మానుయేల్, కొర్రపాటి నాగేశ్వరరావు, తాడిశెట్టి మురళి,తాళ్ళ వెంకటేష్ యాదవ్, జంపని హనుమంతరావు, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, షేక్ మీరావలి, కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు, మన్నవ వంశీకృష్ణ, చుక్కపల్లి రమేష్, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, ఈరంటి వరప్రసాద్ బాబు, కొమ్మినేని కోటేశ్వరరావు, పోతురాజు సమత, తాడివాక సుబ్బారావు, పాటిబండ్ల బలరాం, మల్లెంపూడి శ్రీనివాసరావు, యర్రగోపు నాగేశ్వరరావు, యం. దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

- టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు చుక్కపల్లి రమేశ్ ఆధ్వర్యంలో వైసీపీ పార్టీకి చెందిన ఎస్సీ నాయకుడు, లీగల్ సెల్ సభ్యుడు ఎం.దేవరాజు.. తెనాలి శ్రావణ్ కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలను తట్టుకోలేకే ఆ పార్టీని వీడుతున్నారని అన్నారు. త్వరలోనే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అన్నారు.

తనిఖీల్లో రూ.2.21లక్షలు స్వాధీనం

తెనాలి రూరల్, ఏప్రిల్ 28: వేర్వేరు చోట్ల ఎన్నికల నిబంధనలు పాటించకుండా నగదు తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని బుర్రిపాలెం వద్ద వెహికల్స్ చెక్‌చేసే క్రమంలో ఓ ద్విచక్రవాహనదారుడి నుంచి రూ.లక్ష, నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేసే క్రమంలో ఓ కారులో రూ. లక్ష 21వేలు సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నగదుకు సంబంధించిన ఎటువంటి బిల్లులు లభించలేదన్నారు.

- గుంటూరు(తూర్పు): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిర్వహించిన తనిఖీల్లో రూ.1,377 విలువ కలిగిన 1.62 లీటర్ల మద్యం, పొన్నూరు నియోజకవర్గంలో రూ.6,120 విలువైన 7.2 లీటర్ల మద్యంతో పాటు రూ.2,70,000 నగదు, తెనాలి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో వరుసగా రూ.2,21,000, రూ.1,20,000, రూ.1,00,000 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 28 సాయంత్రం 6గంటల వరకు రూ.2,53,42, 262 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

నేడు నారా బ్రాహ్మణి పర్యటన

మంగళగిరి, ఏప్రిల్ 28: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ తరపున నారా బ్రాహ్మణి సోమవారం మంగళగిరిలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు తాడేపల్లి పట్టణం నులకపేటలోని చైతన్య తపోవన్‌లోని శ్రేయో మండపంలో తాడేపల్లి మండల స్త్రీశక్తి, మహిళా మిత్ర, డ్వాక్రా మహిళలతో సమావేశమవుతారు. అనంతరం 7:20 గంటలకు మంగళగిరి కాళీమాత ఆలయం వద్ద కూరగాయల వర్తక వ్యాపారులతో మాటామంతీలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

నేడు లోకేశ్ పర్యటన వివరాలు

మంగళగిరి, ఏప్రిల్ 28: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ సోమవారం నియోజకవర్గంలోని దుగ్గిరాల మండలంలో పర్యటించనున్నారు. సాయంత్రం 5 గంటలకు చుక్కపల్లివారిపాలెం, 6.30 గంటలకు చినపాలెం, 8 గంటలకు శృంగారపురం గ్రామాల్లో జరిగే రచ్చబండ కార్యక్రమాల్లో లోకేశ్ పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

కొర్నెపాడులో టీడీపీలోకి భారీగా చేరికలు



వైసీపీ నుంచి టీడీపీకి వచ్చిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బూర్ల రామాంజనేయులు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 28: మండలపరిధిలోని కొర్నెపాడులో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. సుమారు 200 మంది పార్టీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు సమక్షంలో పార్టీలోకి వచ్చారు. 14వ వార్డు సభ్యుడు షేక్ మహబూబ్ సుభానితో పాటు అహ్మద్ సయ్యద్, జాన్ సయ్యద్, నాగూర్ వలిలతో పాటు వారి కుటుంబసభ్యులు మొత్తం 150 మంది, అశోక్, సుధాకర్, తిరుమలరాజు, శ్యాము, మహేశ్వరరావులతో పాటు వారి కుటుంబసభ్యులు 50 మంది వైసీపీని వీడి టీడీపీ గూటికి చేరారు. వారికి టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కలసికట్టుగా వైసీపీని సాగనంపుదాం

● పార్టీ శ్రేణులకు రామాంజనేయులు పిలుపు

కలసికట్టుగా అందరం పనిచేసి వైసీపీని సాగనంపుదామని బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలపరిధిలోని కొర్నెపాడులో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు చంద్రబాబు అధికారంలోకి వస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ఎప్పుడెప్పుడు జగన్ రాష్ట్రం నుంచి పాలద్రోలుదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే ఉజ్వల భవిష్యత్తు

● తెలుగురైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్

కాకుమాను, ఏప్రిల్ 28: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలుగురైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్ అన్నారు. మండలపరిధిలోని కొమ్మూరులో ఆదివారం టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగస్టీన్ మాట్లడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సామాజికి పెన్షన్‌లు రూ.4వేలకు పెరుగుతుందన్నారు. అలాగే రైతులకు పంట పెట్టుబడి సాయం, విద్యార్థులకు తల్లులకు ప్రతి విద్యార్థికి అమ్మకు వందనం అమలవుతాయని స్పష్టం చేశారు. వైసీపీ ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టో వల్ల పేదలకు ఒరిగిందేమిలేదన్నారు. గత ఏడాది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వర్గాలకు ఇవ్వాల్సిన చేయూత నగదు ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమ కాలేదని విమర్శించారు. అలాగే ఎన్నో సంక్షేమ పథకాల నిధులు బటన్‌లు నొక్కిన లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బషీర్, అబ్దుల్ నబీ, తదితరులు పాల్గొన్నారు.

● కాకుమానులో ఆదివారం టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణచంద్రరావు, బోడపాటి ప్రసాద్ తదితర నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ, కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని రామ్‌గోపాల్ కార్యకర్తలకు సూచించారు.

లోకేశ్‌కు ప్రజలంతా అండగా నిలవాలి

మాజీ కౌన్సిలరు మన్నెం అరుణ



పేదలకు భోజనం వడ్డిస్తున్న మన్నెం శ్రీనివాసరావు, అరుణ

మంగళగిరి, ఏప్రిల్ 28: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలంతా నారా లోకేశ్‌కు అండగా నిలవాలని మాజీ కౌన్సిలరు మన్నెం అరుణ కోరారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నేత వల్లభనేని సాయిప్రసాద్ జ్ఞాపకార్థం ఆదివారం మంగళగిరి బస్టాండు సెంటర్లోని అన్న క్యాంటిన్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ సాయిప్రసాద్ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతి కోసం పనిచేశారని, మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా రైతులకు విశేష సేవలందించారని గుర్తుచేశారు. మంగళగిరిలో నారా లోకేశ్ ఓడిన ప్పటికీ అయిదేళ్లుగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత మన్నెం శ్రీని వాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత అమరా సుబ్బారావు సతీమణి ఆకస్మిక మృతి



అమరా లక్ష్మి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న లోకేశ్

తాడేపల్లి, ఏప్రిల్ 28 : తాడేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు అమరా సుబ్బారావు సతీమణి అమరా లక్ష్మి గుండెపోటుతో ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురై ఆమె ఆకస్మిక మృతికి నివాళులర్పిస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సుబ్బారావు, కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో సుబ్బారావును ఓదార్చేందుకు మాటలు రావడం లేదని లోకేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ నియోజకవర్గ, మండల, పట్టణ నేతలు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో ఆదరణ

తాడికొండ, ఏప్రిల్ 28: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల్లో ఆదరణ లభిస్తుందని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రెటరి బండ్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం తాడికొండ శివారు బడేపురంలో ఎన్నికల ప్రచారాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ఐదు సంవత్సరాల కాలంలో వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలకు వివరించారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చేసే పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షురాలు సీతాదేవి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభజనంలో వైసీపీ కొట్టుకుపోతుంది

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్



పార్టీలో చేరిన వారితో టీడీపీ అభ్యర్థి శ్రావణకుమార్

తాడికొండ, ఏప్రిల్ 28: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభజనంలో వైసీపీ కొట్టుకుపోతుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం తాడికొండ మండలం లాం, తాడికొండ గ్రామాల్లోని వైసీపీ శ్రేణులు ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తాడికొండ గ్రామంలోని టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దూరి హనుమంతరావు నాయకత్వంలో వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు జూపల్లి నాగేంద్రం, తాడికొండ రజక సంఘం సభ్యులు కలుగూరి వరలక్ష్మీ, నాగరాజు, మరో 17 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే లాం గ్రామంలోని 50 మంది ముస్లిం యువకులు వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల తరువాత వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగించారని ప్రజలు ఓటుతో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, మైనార్టీ నాయకులు షేక్ సుభాని, షేక్ సైపుద్దీన్, షేక్ అలీ, యాసీన్, కొమ్మినేని పున్నారావు, నూతక్కి నవీన్‌కుమార్, ముక్కెర శ్రీనివాసరావు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అదో మోసం.. ఇదో మోసం... ఇదీ జగన్ నైజం

మేడికొండూరు ఏప్రిల్ 28: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో మ్యానిపెస్టో అమలు చేయకుండా మోసం చేశాడని, తాజాగా విడుదల చేసిన మ్యానిపెస్టోలో మరో మోసానికి సిద్ధమయ్యాడని, ఇదీ జగన్ నైజమని తెనాలి శ్రావణకుమార్ చెప్పారు. ఆదివారం మేడికొండూరు మండలం సిరిపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన చేతగాని అసమర్థుడిగా మిగిలిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన చేతగానితనాన్ని ముందే బయట పెట్టాడని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు సంపద సృష్టిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. కేవలం అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు నామమాత్రంగా ఇస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశాడని విమర్శించారు. మరోసారి వైసీపీని గెలిపిస్తే ప్రజల బానిసలు జీవించాల్సి వస్తుందని హెచ్చరించారు. రోజువారి కూలీలను, భవన నిర్మాణ కార్మికుల గోడు పట్టించుకోకుండా ఇసుక మాఫియా ద్వారా ఇతర రాష్ట్రాలకు ఇసుకను అమ్ముకున్న చరిత్ర జగన్మోహన్‌రెడ్డిదని, పేద ప్రజలను జగన్ దారుణంగా వంచించాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు గుంటుపల్లి సాంబశివరావు, పాములపాటి శివన్నారాయణ, ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నార్నె శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు షేక్ అబ్దుల్ గఫూర్, షేక్ నన్నె, మర్రిపూడి రాంబాబు, కడియాల గణేష్, తాడికొండ జనసేన నాయకుల బేతపూడి విజయశేఖర్ తదితరులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పొనుగుపాడులో ఎన్నికల ప్రచారంలో తెనాలి శ్రావణ్‌కుమార్

70 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

మండలంలోని సిరిపురంలో వైసీపీకి చెందిన 70 కుటుంబాల వారు ఆదివారం తెనాలి శ్రావణకుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

అరాచకపు పాలనకు ఓటు ద్వారా అడ్డుకట్ట వేయాలి

ఫిరంగిపురం, ఏప్రిల్ 28: రాష్ట్రంలో అరాచకపు పాలనకు వ్యతిరేకంగా ఓటు ద్వారా అడ్డుకట్ట వేయాలని తాడికొండ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పొనుగుపాడు గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ -6 పథకాలు ప్రజల జీవితాలకు భరోసా ఏర్పడిందన్నారు. జగన్ ఇస్తున్న నవరత్నాలు నవమోసాలుగా మిగిలాయన్నారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా జగన్ పథకాలు ఉన్నాయన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా నీటి ప్రాజెక్టులు కట్టకుండా, పరిశ్రమలు లేకుండా, రైతులను, యువతను ప్రజలను మోసగించారన్నారు. గ్రామంలో రోడ్‌షో చేసి ఇంటింటికి తిరిగి ఆయన ఓట్లు అభ్యర్థించారు. పొనుగుపాడు గ్రామాల్లో ముస్లింలు, బీసీలు, ఎస్సీలు పలువురు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో మండవ నరసింహారావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, క్రోసూరి హరిబాబు, కర్లపూడి రాఘవరావు, వెంకటేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలో రూ.లక్ష 20వేలు స్వాధీనం

తాడికొండ, ఏప్రిల్ 28: ఎన్నికల సందర్భంగా ఆదివారం సాయంత్రం తాడికొండ - కంతేరు రోడ్డులో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన వరగాని భానుచందర్ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.1.20 లక్షలు నగదును గుర్తించారు. ఎలాంటి రశీదులు లేకపోవటంతో నగదును సీజ్‌చేసి తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి



గ్రామస్థులకు సూచనలిస్తున్న పోలీసులు

మేడికొండూరు, ఏప్రిల్ 28: సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, సజావుగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ స్పష్టం చేశారు. మేడికొండూరు మండలంలోని గుండ్లపాలెం, వరగాని గ్రామాలలో ఆదివారం రాజకీయ పార్టీల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా పోలీసు చర్యలు తీవ్రంగా ఉంటాయని, ఈవిషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎటువంటి గొడవలకు దిగవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కల్పించవద్దని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, డబ్బు, మద్యం పంపిణీ వంటి కార్యక్రమాలు చేయకూడదని చెప్పారు. ఎన్నికల విధులను అడ్డుకోరాదని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కేసులు నమోదైతే ఇబ్బందుల పాలు అవుతారని, శిక్షలు కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ వాసు, పోలీసు సిబ్బందితో పాటు గుండ్లపాలెం, వరగాని గ్రామస్థులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ కౌన్సెలింగ్‌కు అనూహ్య స్పందన

తాడేపల్లి, ఏప్రిల్ 28: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటి విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లో శుక్రవారం నుంచి జరుగుతున్న కౌన్సెలింగ్‌కు అనూహ్య స్పందన లభిస్తుందని, విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సద్వినియోగం చేసుకుంటున్నారని కేఎల్‌యూ ఈఈఈ కౌన్సెలింగ్ ఛైర్మన్ ఏ జగదీష్, తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు తాము ఫీజు రాయితీలు కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు వచ్చిన ర్యాంకులు, ఇంటర్‌లో వచ్చిన మెరిట్, జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా వారు కోరుతున్న విభాగాన్ని పొందవచ్చన్నారు. అదేవిధంగా తమ విద్యాసంస్థలో ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ఈ నెల ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ సారధివర్మ, కౌన్సెలింగ్ కమిటి కన్వీనర్ డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు రాజకీయ సన్యాసం తప్పదు

● ఎస్‌డీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గురునాథం



సమావేశంలో మాట్లాడుతున్న మాదిగాని గురునాథం

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 28: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను మోసం చేసిన జగన్‌కు రాబోయే సార్వత్రిక ఎన్నికల తరువాత రాజకీయ సన్యాసం తప్పదని సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం హెచ్చరించారు. మంగళగిరి పాతబస్టాండు సెంటరులోని ఆర్ ఆర్ టవర్స్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఆయా కులాల వారికి ఆర్భాటంగా 56 కార్పొరేషన్లు ప్రకటించిన జగన్ కనీసం ఒక్క పైసా నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. జగన్ లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి పరిపాలన సాగిస్తున్నారని, చంద్ర బాబు ముఖ్యమంత్రి అయితే సంపద సృష్టించి సుపరిపాలన అందిస్తారని చెప్పారు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడిని ఓడించేందుకు శిఖండి యుద్ధం చేసినట్టుగా జగన్‌ను ఓడించేందుకు తామంతా శిఖండి యుద్ధం చేస్తామని స్పష్టం చేశారు. మూడు రాజధానుల పేరిట రాష్ట్ర ప్రజలను జగన్ దారు ణంగా వంచించారని, విశాఖ నుంచి పరిపాలన సాగిస్తానని చెప్పడం ఒట్టి బూటకమని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు దళితులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నుంచి నారా లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మంగళగిరి మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ మన్నెం రమేష్‌బాబు, అనిత, నేతలు నరసింహ చౌదరి, నాగ మణి, డాక్టర్ విశ్వనాథం, ఆలపాటి రాధికారెడ్డి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రకటనలు

తాడికొండ, ఏప్రిల్ 28: ప్రజలను మభ్యపెట్టే విధంగా సీఎం ప్రకటనలు చేస్తున్నారని రైతులు, మహిళలు తెలిపారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా తాడికొండలో రైతులు, మహిళలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమరావతిని లేకుండా చేయటమే సీఎం లక్ష్యమని అన్నారు. రాజధాని నిర్మాణానికి భూములు త్యాగాలు చేసిన రైతులను రోడ్డున పడేశారు. రాజధానితో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా 40 సంవత్సరాలు వెనక్కు తీసుకువెళ్లారన్నారు. అమరావతి రాజధానిని నిర్వీర్యం చేయడమే కాకుండా, పోలవరంతో సహా పలు సాగు, తాగు నీటి ప్రాజెక్టులు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధి చేయలేదన్నారు. రివర్స్ టెండరింగ్‌తో ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పడకేపించారన్నారు. ఏపీ ఐకాన్ అయినటువంటి విశాఖ ఉక్కు ఫ్యాక్టరి ప్రవేటుపరం చేయటానికి సీఎం జగన్‌రెడ్డి నాంది పలికారన్నారు. విధ్వంసకర పాలన తప్పితే ఎక్కడా అభివృద్ధి కానరావటం లేదన్నారు. అమరావతిని మూడు ముక్కలు చేసి, రాష్ట్రాన్ని ప్రగతి పథం నుంచి తొలగించారన్నారు. అమరావతి అభివృద్ధి కొనసాగించినట్లైతే రాష్ట్రానికి సిరులు కురిసేవన్నారు.

తాడేపల్లి 19వ వార్డులో జనసేన ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న జనసేనపార్టీ శ్రేణులు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 28: తాడేపల్లి పట్టణంలోని 19వ వార్డు, కేఎల్ రావు కాలనీలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాలతో ఆ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేశ్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కమిటీ సభ్యులు, జనసేన వీర మహిళలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

అద్దెంకమ్మ తల్లికి లక్ష మల్లెల పూజ



లక్ష మల్లెల పూజలో పాల్గొన్న మహిళలు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 28: అద్దెంకమ్మతల్లికి లక్ష మల్లెల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అద్దెంకమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం రాత్రి మహిళలు లక్షమల్లెల పూజలో పాల్గొన్నారు. పండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ ఈ పూజా కార్యక్రమం జరిగింది. అనంతరం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు.

కాపులకు అన్యాయం చేసిన వైసీపిని ఓడిద్దాం

● నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు దాసరి రంగారావు



వరగానిలో ప్రచారం నిర్వహిస్తున్న కాపునాడు నాయకులు

మేడికొండూరు, ఏప్రిల్ 28: రాష్ట్రంలో కాపులకు అన్యాయం చేసిన వైసీపీని రానున్న ఎన్నికల్లో ఓడించి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని తాడికొండ నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు దాసరి రంగారావు సూచించారు. మేడికొండూరు మండలంలోని వరగాని గ్రామంలో ఆదివారం కాపుల ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ వైసీపీ నాయకులు కాపులను వాడుకొని అడుగడుగునా అణగదొక్కారని ఆరోపించారు. తమ నాయకులు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు తామంతా కూటమి అభ్యర్థులను మెజారిటీతో గెలిపించాలన్న లక్ష్యంతో కాపునాడు కృషి చేస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం కాపులంతా ఐక్యంగా గుంటూరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, అసెంబ్లీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడికొండ మండల కాపునాడు అధ్యక్షులు బాదినేని వెంకటరావు, వరగాని కాపు నాయకులు ఆంజనేయులు, బోడపాటి నాగరాజు, అశోక్, సాంబశివరావు, మన్నేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో వార్ వన్ సైడే : లోకేశ్



గొడవర్రు రచ్చబండలో మాట్లాడుతున్న నారా లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 28: వచ్చే ఎన్నికల్లో మంగళగిరి ప్రజలంతా తన పక్షానే ఉన్నారని... ఇక మంగళగిరిలో వార్ వన్‌సైడేనని కూటమి అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. నియోజకవర్గంలోని నీరుకొండలో ఆదివారం ఉదయం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రామాలయంలో పూజలను నిర్వహించి అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన రచ్చబండలో పాల్గొని ప్రసంగించారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించాక అహర్నిశలు శ్రమించి మంగళగిరిని అభివృద్ధికి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చివేస్తానన్నారు. తాను అయిదేళ్లుగా మంగళగిరి ప్రజల సంక్షేమానికి పాటు పడుతూ వచ్చిన సంగతిని ఆయన వివరించారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లను పంపించానని, ప్రజలు సేదతీరడానికి సిమెంటు బల్లలు వేయించానని, పేదల స్వయం ఉపాధికి తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు పంపిణీ చేయించానన్నారు. మహిళల స్వయం ఉపాధి నిమిత్తం వారికి స్త్రీశక్తి పథకం కింద కుట్టులో శిక్షణను ఇప్పించడమే కాకుండా వేలమందికి కుట్టుమిషన్‌లను పంపిణీ చేయించానని గుర్తుచేశారు. పేదల ఇళ్లలో జరిగే వివాహాలకు ఓ కుటుంబసభ్యుడిగా పెళ్లికానుకలను అందజేశానన్నారు. 35 ఏళ్లుగా మంగళగిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించినవారు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారే తప్ప తనలాగా బాధ్యతగా పనిచేయలేదన్నారు. గతంలో తాను యువగళానికి ముందు నీరుకొండలో ఆరు గంటలపాటు వీధివీధికి తిరిగానని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల లోపుగా రాజధాని అంతర్గత రోడ్ల నిర్మాణాన్ని ఖచ్చితంగా పూర్తిచేస్తామన్నారు. మరో ఏడాదిలో భూగర్భ డ్రైనేజి నిర్మాణాన్ని పూర్తిచేయిస్తామన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో 20వేల మందికి పక్కా గృహాలను కట్టించి ఇచ్చే బాధ్యతకు కట్టుబడి ఉన్నానన్నారు. ఈ ప్రాంతానికి మరిన్ని ఐటీ పరిశ్రమలను తెప్పించి యువతకు ఉద్యోగవకాశాలను కల్పిస్తానని లోకేశ్ పునరుద్ఘాటించారు. అలాగే తాము అధికారంలోకి వచ్చాక దళితుల సంక్షేమం కోసం జగన్ రద్దు చేసిన 27 రకాల సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. వృద్ధులకు రూ.మూడు వేలుగా ఉన్న పింఛన్ ను రూ.నాలుగువేలకు పెంచుతామని లోకేశ్ హామీనిచ్చారు. నీరుకొండలో ప్లేగ్రౌండు, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. భూసేకరణ చేసి గ్రామంలో శ్మశాన వాటికలను పూర్తి సదుపాయాలతో మహాప్రస్థానం మోడల్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, తోట పార్థసారధి, తమ్మిశెట్టి జానకీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయకత్వం చారిత్రక అవసరం

● తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య



ఎర్రబాలెంలో లోకేశ్, పెమ్మసానికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

మంగళగిరి, ఏప్రిల్ 28: జగన్ అసమర్థ పాలనలో సర్వం కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ తిరిగి గాడిలో పడాలంటే ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చారిత్రక అవసరమని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య అన్నారు. మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఎర్రబాలెంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఒంగోలు, గుంటూరు నుంచి విచ్చేసిన విభిన్న ప్రతిభావంతులు లోకేశ్, పెమ్మసానికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు నీలం అంకారావు, జనసేన గ్రామ అధ్యక్షుడు సాయినందన్, ఆయా పార్టీల నేతలు ఫిరోజ్‌ఖాన్, కాపరౌతు సుందరయ్య, భాగ్యారావు, నాగరాజు, గడదాసు రంగారావు, ప్రసాద్, కానుకొలను సుబ్బారావు, శివనాగేశ్వరరావు, ఆకుల పానకాలరావు, లక్ష్మీనారాయణ, శివప్రసాద్, తోట సురేష్, చింతా జగన్, యలమంచిలి పద్మజ, అప్పల శాంతి తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డివి అబద్ధపు ప్రచారాలు



పేరేచర్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముస్లిం నాయకులు

మేడికొండూరు, ఏప్రిల్ 28: వైసీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని పలువురు ముస్లిం నాయకులు ఆరోపించారు. గుంటూరు పార్లమెంట్ టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఘని, తాడికొండ మాజీ ఎంపీపీ షేక్ రిజ్వాన తదితరులు మేడికొండూరు మండలం పేరేచర్లలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ముస్లిం ఆడపిల్ల పెళ్లికి లక్ష రూపాయలు ఇస్తానని చెప్పిన జగన్ నాలుగేళ్ల పాటు ఒక్క రూపాయి ఇవ్వలేదని అన్నారు. ముస్లింలకి సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. విదేశీ విద్యాపథకాన్ని రద్దు చేసి ముస్లిం విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేశారని తెలిపారు. మసీదుల మరమ్మతులకు నిధులు ఇవ్వలేదని, ఒక్క షాదిఖానా కూడా కట్టలేదని ఆరోపించారు. ముస్లింలకు కోసం ప్రత్యేక బ్యాంకు ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ రెడ్డి ముస్లిం సమాజానికి తీరని ద్రోహం చేశారని చెప్పారు. ఇలాంటి ముఖ్యమంత్రిని ఈ రాష్ట్రం నుంచి తరిమి కొట్టే దాకా ముస్లింలంతా ఏకతాటి పైకి రావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించి వైసీపీకి బుద్ధి చెప్పాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ బాబావాలి, మహమ్మద్ హుస్సేన్, షేక్ మస్తాన్, షేక్ గస్ సైదా, షేక్ బాజీ షేక్ రహమతుల్లా పాల్గొన్నారు

ఇండియా కూటమితోనే ఈ ప్రాంతం అభివృద్ధి

● జంగాల అజయ్ కుమార్, కొరివి వినయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పక్కన కొరివి వినయ్‌కుమార్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28: ఈ ప్రాంతంలో అభివృద్ధి ఇండియా కూటమితోనే సాధ్యమవుతుందని గుంటూరు పార్లమెంటు ఇండియా కూటమి అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, ప్రత్తిపాడు అభ్యర్థి కొరివి వినయ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడులోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రత్తిపాడు ప్రాంతాన్ని ఎన్నో రకాలుగా అభివృద్ధి చేయవచ్చునన్నారు. కాని ఇక్కడ సవర్థవంతమైన నాయకత్వం లేకపోవడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందలేదన్నారు. ఇండియా కూటమికి అవకాశం ఇస్తే ఎప్పటి నుంచో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు డెవలప్‌మెంట్ అంటే ఏమిటో చేసి చూపిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడా హనుమంతరావు, అరుణ్ కుమార్, ఆదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సర్పంచ్ రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ నాగభూషణం, మాజీ ఎంపీపీ వెంకట్రావు తదితరులు

కూటమి అభ్యర్థులను గెలిపించండి

● టీడీపీ నాయకుడు, గ్రామ ఉప సర్పంచ్ నాగభూషణం

తెనాలి మారీసుపేట, ఏప్రిల్ 28: రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అభ్యర్థులను గెలిపించండని టీడీపీ నాయకుడు, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం కోరారు. మండల పరిధిలోని అంగకుదురు గ్రామంలో ఆదివారం గ్రామ టీడీపీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కోసం ఉమ్మడి పార్టీల అభ్యర్థులైన జనసేన పీఏసీ ఛైర్మన్ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కి గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు పవన్ కల్యాణ్, నరేంద్ర మోదీల సహకారంతో నవ్యాంధ్రప్రదేశ్ నిర్మంచగలరన్నారు. ఉమ్మడి పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, వార్డు మెంబర్లు జాలాది దుర్గాభవాని, చెన్నుపాటి తేజస్వి, ఐనంపూడి పార్వతి, ఆలపాటి వెంకట్రామయ్య, అలపర్తి సుధాకర్, కె శ్రీనివాసరావు, ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శారద, సిబ్బంది

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి

● డాక్టర్ శారద

తెనాలి రూరల్, ఏప్రిల్ 28: ప్రతిరోజు వాకింగ్, వ్యాయామాలు చేయడం అలవరచుకుంటే ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని శారదా సర్వీసెస్ సొసైటీ నిర్వాహకురాలు డాక్టర్ శారద అన్నారు. డిశారదా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో డాక్టర్ శారద ఆధ్వర్యంలో షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యశిబిరం ద్వారా 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ శారద షుగర్ వ్యాధిగ్రస్తులకు తీసుకోవాల్సిన ఆహారం, వాకింగ్, యోగా వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పావులూరి ట్రస్ట్ ఛైర్మన్ పావులూరి శ్రీనివాసరావు, పాతులూరి భానుమూర్తి, శ్రీశైలభక్త సేవా సమితి సభ్యులు, శారదాసర్వీసెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 28: స్థానిక రజకపేటలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామివారి దేవస్థానం వద్ద శ్రీప్రసన్నాంజనేయ స్వామి భక్త బృందం వారు చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు. శ్రీప్రసన్నాంజనేయ స్వామి భక్త బృందం సభ్యుడు బేతపూడి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పాదచారులకు, పట్టణ ప్రజలకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్నిలో ఉప్పలపాటి సాయి, బి హిమాచలరావు, నెప్పల్లి రాంబాబు, ఎస్ శ్రీనివాసరావు, ప్రవీణ్, సాయి పవన్ తదితరులు పాల్గొన్నారు.

బోసురోడ్డులో...

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 28: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. పుచ్చా కాత్యాయని సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, అబ్దుల్ రజాక్, పోతరాజు, బాలునాయక్, శ్రీను, ప్రతాప్, శ్రీరామూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కమిటీ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం, సభ్యులు

సరస్వతీ శిశుమందిర్ గ్రాడ్యుయేషన్ డే

తెనాలి అర్బన్, ఏప్రిల్ 28: సరస్వతీ శిశుమందిర్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా ఆదివారం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు సామల లక్ష్మణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలన్నారు. డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ, మానవతా విలువలను, సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు ఎక్కువగా శిశుమందిర్ పాఠశాలలు నేర్పుతున్నాయన్నారు. కార్యదర్శి కొసనం జగదీష్, కరస్పాండెంట్ కోడూరి రమాదేవి, హనుమంతరావు, నరసింహారావు, శ్రీమన్నారాయణ, నాగేంద్రం, దీప్తి, లత, శివప్రసాద్‌లు ప్రసంగించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



చంద్రమౌళి

చేబ్రోలు, ఏప్రిల్ 28: మతి స్థిమితంలేని వృద్ధుడు అదృశ్యమయ్యాడు. మండలంలోని శలపాడు గ్రామానికి చెందిన వాకా చంద్రమౌళి (75) శనివారం సాయంత్రం నుండి కనిపించడంలేదు. బంధువులను పరిచయస్తులను విచారించినా ఆచూకి లభించలేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఎవరికైనా ఇతడి ఆచూకీ తెలిస్తే కుమారుడు నరసింహారావు ఫోన్ నెంబరు 8374029055కు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



రెడ్‌క్రాస్ నూతన ఛైర్మన్ వెంకటేశ్వర గుప్తాను సత్కరిస్తున్న అధికారులు

రెడ్‌క్రాస్ సేవలు నిరుపమానం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 28: ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు సంభవించిన సమయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందించే సేవలు నిరుపమానమని తహసీల్దార్ సూర్యనారాయణసింగ్ అన్నారు. ఆదివారం పొన్నూరు శాఖ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా వేములూరి వెంకటేశ్వరగుప్తా, వైస్ ఛైర్మన్‌గా రావిపాటి శ్రీనివాస్ కిరణ్, కోశాధికారిగా కె.ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న సామాజిక సేవలు రక్తదాన శిబిరాల గురించి చర్చించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి ఎ.రవి, శ్రీనివాస్, సభ్యులు పి.రవీంద్రనాథ్, డాక్టర్ బిందు, కోట వెంకటేశ్వర్లు, డాక్టర్ ఏవీ కృష్ణ దేవ్, పి.గణేష్, నన్నపనేని బాలకృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత ఆర్యవైశ్య కుటుంబాలను ఆదుకుంటాం

● ఆత్మీయ సమావేశంలో ధూళిపాళ్ళ



నరేంద్రకుమార్‌కు హారతులు పడుతున్న ఆర్యవైశ్య మహిళలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 28: రోడ్డు విస్తరణలో సర్వం కోల్పోయిన బాధిత ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా నిలవడమే కాకుండా అన్ని రకాలుగా ఆదుకుంటామని మాజీ ఎమెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఆర్యవైశ్యులు ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆర్యవైశ్య మహిళలు హారతులు పట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆర్యవైశ్యులు ఐదేళ్లుగా తాము ఎదుర్కొన్న సమస్యలను వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా రోడ్డు విస్తరణ సమయంలో తమకు జరిగిన అన్యాయాన్ని ఏకరువుపెట్టారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో అధికారులు, పాలకులు కలిసి వ్యాపారులను వేధించి చందాలు వసూళ్లు చేసిన వైనాన్ని వివరించారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో పొన్నూరు పట్టణంలో జరిగిన అరాచకం తను జీవితంలో చూడలేదన్నారు. స్వయంగా ఎమ్మెల్యేనే బాధితులను బెదిరించి సంతకాలు చేయించారని ఆరోపించారు. నాయకులను నిలబెట్టి బాధితులు నోరు విప్పితే భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. అలాగే పరిహారం ఇవ్వకుండా బాధితులకు ఎమ్మెల్యే రోశయ్య తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. భవనాల కూల్చిన శిథిలాలను కూడా వైసీపీ నాయకులు ట్రాక్టర్ తరలించి అమ్ముకొని జేబులు నింపుకున్నారని ఆరోపించారు. బాధితులు మౌనంగా రోదించటం తన కళ్లారా చూశానని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో బాధితుల కుటుంబాలకు కృషి చేస్తానని ఆర్యవైశ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండి రాజేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, సంకా బాలాజి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: నరేంద్ర

పెదకాకాని, ఏప్రిల్ 28: గ్రామంలో రైతుల సమస్యల పరిష్కారానికి చేస్తామని.. లిఫ్ట్ ద్వారా పంట పొలాలకు నీరు అందిస్తామని పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ హామీ ఇచ్చారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పెదకాకాని మండలం తంగెళ్లమూడి గ్రామంలోని ప్రజానీకంతో ముఖాముఖి (కార్నర్) సమావేశంలో హాజరై వారు ఎదుర్కొంటున్న సమస్యలైన మెయిన్ రోడ్డు నుంచి తంగెళ్లమూడి గ్రామానికి ప్రధాన రహదారి నిర్మించాలని కోరారు. తంగెళ్లమూడిలో గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఇళ్లకు బిల్లు ఇంతవరకు ఇవ్వలేదు అని మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లులు ఇప్పించాలని కోరారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు నరేంద్రకుమార్ దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ధూళిపాళ్ళ అధికారంలోకి రాగానే సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని ఆ ఏరియా ప్రజలకు హామీ ఇచ్చారు.

● అనుమర్లపూడి గ్రామ ప్రజానీకంతో రామాలయం దగ్గర ముఖాముఖి సమావేశంలో పాల్గొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నారు. అనుమర్లపూడి చెరువు పోరంబోకు పొలం భూమిని కొంత మంది అధికార పార్టీ నాయకులు ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించు కున్నారని.. ఆ పొలం స్వాధీనం చేసుకొని అర్హులకు పట్టాలు ఇప్పించాలని కోరారు. గ్రామంలోని సమస్యలు ఆయన దృష్టికితేగా సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. తక్కెళ్ళపాడులోని వివిధ ఏరియాలో ప్రజానీకంతో ముఖాముఖి సమావేశంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. తక్కెళ్ళపాడులోని రజక, నాయీబ్రాహ్మణ, ఎస్సీ మాల సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరారు. నందివె లుగు అడ్డ రోడ్డు ఏరియా, అంబేడ్కర్‌నగర్, బాల ఏసునగర్ కాలనీ ప్రజ లకు మంచి నీరు సరఫరా సక్రమంగా లేదని మంచినీటి ట్యాంక్ నిర్మించి అందరికి సక్రమంగా మంచినీరు అందేవిధంగా చేయాలని కోరారు.. ప్రభుత్వ స్థలాల్లో ఎప్పటి నుంచో ఇల్లు వేసుకున్న వారికి పట్టాలు ఇప్పించాలని వారికి ఇల్లు కట్టుకోవడానికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయించాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన నరేంద్రకుమార్ అధికారంలోకి రాగానే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీ కృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరేళ్ళ వెంకటేశ్వరరావు, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తంగెళ్ళమూడిలో పర్యటిస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదరావూరు గ్రామానికి మంచిచేస్తా.. ఆశీర్వదించండి

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్





పెదరావూరులో మనోహర్‌ను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు, తెనాలి 29వ వార్డులో ప్రచారం చేస్తున్న మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 28: పెదరావూరు గ్రామమంటే నాకు ఎంతో అభిమానం.. గ్రామంలోనే రాబోయే రోజుల్లో ఇల్లు కట్టుకుంటా.. రానున్న ఎన్నికల్లో గ్రామస్థులందరూ ఉమ్మడి పార్టీల అభ్యర్థులకు ఓటు వేసి ఆశీర్వదించాలని జనసేన పీఏసీ ఛైర్మన్, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని పెదరావూరులో తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్షణ సువార్త పండుగ కూటములలో నాదెండ్ల మనోహర్ పాల్గొని ప్రసంగించారు. రక్షణ సువార్త పండుగ వేడుకల్లో దైవ ఆశీస్సులతో పాటు సంఘస్తులందరిని కలవడం సంతోషంగా ఉందన్నారు. తాను అధికారం చేపట్టిన తరువాత గ్రామంలో సంఘస్తుల కోసం కల్యాణమండపం, శ్మశాన వాటిక వంటివి నిర్మించడం తోపాటు గ్రామస్థుల అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న మనోహర్‌ను గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. తొలుత గ్రామంలోకి విచ్చేసిన మనోహర్‌ను ఉమ్మడి పార్టీ శ్రేణులు, నిర్వాహక కమిటీ సభ్యులు పూలమాలలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. తెలుగు బాప్టిస్ట్ చర్చి కమిటీ సభ్యులు, మత పెద్దలు, గ్రామ పెద్దలు ఎం.సీతారామయ్య, సంఘస్తులు, ఉమ్మడి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తెనాలి ప్రాంతాన్ని తీర్చిదిద్దుకుందాం...

తెనాలి రూరల్, ఏప్రిల్ 28: వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందని తెనాలి పట్టణాన్ని తిరిగి తీర్చిదిద్దుకుందామని అందుకు ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని జనసేన పీఏసీ ఛైర్మన్ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగుజనచైతన్య పాదయాత్రలో భాగంగా ఆదివారం ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పట్టణంలోని 29వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులో గడపగడపకు తిరుగుతూ ప్రజలకు అభివాదం చేస్తూ వారి యోగక్షేమాలను విచారించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మనోహర్‌కు పారిశుధ్యం, దోమలు ఉధృతితో పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న మనోహర్‌కు గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తొలుత వార్డులో పర్యటనకు వస్తున్న మనోహర్‌ను ఉమ్మడి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. వీరవల్లిమురళి, పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలందరూ ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు ముందుకు రావాలన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి: మనోహరం

తెనాలి రూరల్, ఏప్రిల్ 28: కొలకలూరు ఎస్సీ కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని రానున్న ఎన్నికలో ఎన్డీఏ కూడమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం అన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ డాక్టర్ మనోహరం ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం కొలకలూరు ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, జెట్టిరేణుక, సరోజ, కేసన కోటేశ్వరరావు, నాగేంద్రం పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో సూపర్‌సిక్సు పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న మనోహరం, రేణుక, ప్రీతి తదితరులు

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

తెనాలి రూరల్, ఏప్రిల్ 28: చీప్ లిక్కర్ సంపాదనకు రుచిమరిగిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో సాగనంపుదామని జనసేన పీఏసీ ఛైర్మన్, ఉమ్మడి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం తెనాలిలో వార్డు పర్యటన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో ప్రజలు మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే క్షేత్రస్థాయిలో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. సంపూర్ణంగా రాష్ట్రంలో మద్యాన్ని నిషేదిస్తానన్న జగన్ నాసిరకం బ్రాండ్లు తెచ్చి అధిక ధరలకు విక్రయించి లిక్కర్ మీద సంపాదనకు తెరలేపారని ఆరోపించారు. ఆ మద్యంతాగిన ప్రజలు తీవ్ర అనారోగ్యసమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వానికి అవేం పట్టడంలేదని ఆరోపించారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంపూర్ణమద్యపాన నిషేధం అమలుచేసిన తరువాతే తిరిగి ఓటు అడుగుతానని చెప్పారని ఇప్పుడు అది అమలు చేయకుండా ప్రజలను ఎట్లా ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం మరుగునపడి అంధకారం అలుముకుందని రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు కోసం, యువతరం కోసం, ప్రజల సంక్షేమం కోసం పాటుబడే విధానాన్ని ప్రజలకు తెలియజేస్తూ వారిలో భారోసా కల్పించే విధంగా ఉమ్మడి కూటమి కార్యాచరణ ఉంటుందని ప్రజలందరూ ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

కూటమి అభ్యర్థులను గెలిపించండి

● ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో కూటమి నాయకులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 28: వివాదాలకు దూరంగా ఉంటూ సమాజసేవకు తమవంతు సాయం అందించే మంచి మనస్సున్న వారు ఆర్యవైశ్యులని వారికి ఉమ్మడి ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం సాయంత్రం తెనాలి ఎన్వీఆర్ కల్యాణ మండపంలో నియోజవర్గస్థాయి ఆర్యవైశ్యసంఘాల నాయకులు, సభ్యులతో ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తెనాలి ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్యవైశ్యసోదరులపై దాడులు జరగడం బాధాకరమన్నారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ఆర్యవైశ్యుల భద్రతకు అధిక ప్రాధాన్యమిచ్చామని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో తిరిగి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్యవైశ్యుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అందరికీ అండగా నిలుస్తామన్నారు. తెనాలి - మంగళగిరి హైవే నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటు చేసి తెనాలి వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిచేలా కృషి చేస్తానని నాదెండ్ల స్పష్టం చేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెనాలిలో దాడుల సంస్కృతి వైసీపీ ప్రభుత్వంతోనే ప్రారంభమైందని మంచికి మారుపేరుగా ఉన్న ఆర్యవైశ్య సోదరులపై దాడులకు తెగబడటం బాధాకరమన్నారు. గతంలో ఆర్యవైశ్య సోదరులు తమపై దాడులు జరిగాయంటూ రోడ్డుపైకి వచ్చిందే లేదన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి రత్నశ్రీ మాట్లాడుతూ తన భర్త చంద్రశేఖర్ రాజకీయాల్లోకి కేవలం ప్రజలకు మంచి చేయాలని ప్రాంతానికి తన వంతు సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో వచ్చారన్నారు. రాజకీయాల్లో అవినీతికి తావులేకుండా మచ్చలేని మనిషిగా చివరివరకూ నిలుస్తారన్నారు. ఆర్యవైశ్యులంటే తమకు అమితమైన గౌరవమని రాబోయే ఉమ్మడి ప్రభుత్వంలో వారి అభ్యున్నతికి మరింతగా పాటుబడతామన్నారు. మాజీ మంత్రి నన్నపనేని, బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. తొలుత శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి చిత్రపటానికి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి రత్నశ్రీ, మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారిలు పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నంబూరి కృష్ణమూర్తి, చుండూరు ఉమామహేశ్వరరావు, దుండి రాకేష్, పెండ్యాల వెంకట్రావు, పెండ్యాల సుబ్బారావు, తాత శ్రీనివాస్, కొప్పురావూరు కిషోర్, తవ్వా నాగప్రసాద్, వెంకటరత్నం, దేసు యుగంధర్, మువ్వల శ్రీనివాస్, అనంత్, హేమంత్, గోనుగుంట్ల శ్రీనివాస్, పలువురు ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న దళిత సార్వత్రిక ఉపకులపతి కృపాచారి, సత్యనారాయణ తదితరులు

భావ వ్యక్తీకరణకు భాష అవసరం

● దళిత సార్వత్రిక ఉపకులపతి ఆచార్య కృపాచారి

తెనాలి మారీసుపేట, ఏప్రిల్ 28: భావ వ్యక్తీకరణకు భాష అవసరమని దళిత సార్వత్రిక ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. స్థానిక నందులపేటలోని కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం మానవ వికాస చరిత్రలో ముద్రణావికాసం అనే అంశంపై చర్చను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దళిత సార్వత్రిక ఉపకులపతి కృపాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరం భాషకు ప్రాణం పోస్తుందని, ఆ భాషను అజరామరం చేయాలన్నది అచ్చు యంత్రం ప్రధాన లక్ష్యం అన్నారు. భావ వ్యక్తీకరణకు తొలుత బొమ్మలు, అక్షరం, భాషా, శాసనం, ముద్రణా పరిణామం ద్వారా భాషకు శాశ్వతత్వం కల్పించడం జరిగిందన్నారు. అనంతరం ఆచార్య కృపాచారిని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మొవ్వా సత్యనారాయణ, ప్రసాదం పూర్ణచంద్రరావులు దుశ్శాలవాతో సత్కరించి, మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకా పేరిరెడ్డి, చలమయ్య, అజ్గరలి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ గుంటూరు- 2 డీఎం

గుంటూరు, ఏప్రిల్ 28 : ఆర్టీసీ పరమైన సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ గుంటూరు-2 డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-హైదరాబాద్, గుంటూరు- తెనాలి, గుంటూరు-విజయవాడ, గుంటూరు-విశాఖపట్నం రూట్‌లలో ఆర్టీసీ బస్సులు, సమస్యలతో పాటు సిబ్బంది పనితీరు, సలహాలు, సూచనలతో సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959225421కు ఫోన్ చేయాలని కోరారు.

మే1న సోమేపల్లి జయంతి సందర్భంగా కవి సమ్మేళనం

గుంటూరు, ఏప్రిల్ 28: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మే1న ఉదయం 10 గంటలకు సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి కార్యక్రమాలు బృందావన్‌గార్డెన్స్ 5వ లైన్‌లోని అన్నమయ్య గ్రంథాలయ ప్రాంగణంలో జరుగుతాయని జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు సాహితీరంగంలో సోమేపల్లి చేసిన కృషిని స్మరించుకుంటారన్నారు.

నాలుగేళ్లయినా పూర్తికాని జంపని డ్రెయిన్

● నిధులు కేటాయించినా ఫలితం సున్నా

● వర్షాలకు మునుగుతున్న ప్రధాన రహదారులు



2020లో వేసిన శిలాఫలకం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 28: పట్టణంలో కొద్దిపాటి వర్షాలకు ప్రధాన రహదారులు ముంపునకు గురవుతుంటాయి. ఈ ముంపునకు పరిష్కారం చూపే జంపని డ్రెయిన్ శంకుస్థాపన చేసి నాలుగేళ్లకు పైగా అయ్యింది. శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ 2020 ఫిబ్రవరిలో 10వ వార్డులో శంకుస్థాపన చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.30లక్షలు కేటాయించారు. సమృద్ధిగా ఆదాయం వచ్చే మున్సిపాలిటీలో డ్రెయిన్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సినప్పటికీ శంకుస్థాపన చేసి పట్టించుకోకుండా వదిలివేశారు. బోసురోడ్డులోని రైతు బజారు, కొత్తపేటలోని పలు రహదారులు వర్షా కాలంలో వర్షం కురిసినప్పుడల్లా వాననీరు, మురుగునీరు ఏకమై రహదారుల్లో అడుగుమేర నీరు పారుతుంది. ఓ పూట గడిస్తే కాని రోడ్లపై ఉన్న నీరు తగ్గదు. నీరుపోయిన తరువాత ఆ రోడ్లు చూస్తే కాల్వల్లో వ్యర్థాలు, మురుగు, బురద అంతా రోడ్లపైనే పేరుకుంటుంది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ ముంపు నీరంతా జంపని డ్రెయిన్ ద్వారానే పట్టణ వెలుపలకుపోతుంది. డ్రెయిన్‌ను అభివృద్ధి చేయకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకం...

డ్రెయిన్ నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేయలేకపోవడంతో ఇందుకు వేసిన శిలాఫలకం వెక్కిరిస్తోంది. సుమారు 300మీటర్ల మేర డ్రెయిన్ నిర్మాణం నాలుగేళ్లలో పూర్తిచేయలేకపోయారంటే ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టణ అభివృద్ధి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుంది. ఈ రహదారి చివరలో ఉండే పేదలు వర్షా కాలంలో రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీటిలోనే తిరగాల్సిన పరిస్థితి ఉంది. డ్రెయిన్‌లో తరచూ వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు ముందుకు పారక స్థానికులు దోమల బెడదతో అల్లాడుతున్నారు.

పట్టని ఎన్నికల కోడ్....

జంపని డ్రెయిన్ శంకుస్థాపన కోసం వేసిన శిలాఫలకానికి వైసీపీ రంగులు వేశారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే శిలా ఫలకంపై ఉన్న పేర్లు కనపడకుండా కాగితం అంటించారు. కాగితం చీకిపోయి ఊడిపోవడంతో పేర్లు బయట పడ్డాయి. వైసీపీ రంగులను కూడా ఇప్పటికీ తొలగించలేదు. ఎన్నికల కోడ్ అమలుతీరు ఇదేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

లో లెవల్‌లో రహదారి...





లోతట్టుగా ఉన్న రహదారి

జంపని డ్రెయిన్ వెంట ఉన్న రహదారి కొంత భాగం లో లెవల్‌లో ఉంది. రెండు వైపులా ఎత్తున్న రహదారి మధ్యలో 100 మీటర్ల మేర తక్కువ ఎత్తులో ఉంది. రహదారి నిర్మాణంలో కొంత భాగాన్ని వదిలి వేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్లు అయినా కొద్దిమేర లో లెవల్‌లో ఉన్న రోడ్డును వేయలేకపోవడం పట్ల స్థానికులు విమర్శిస్తున్నారు. తక్కువ ఎత్తులో కొద్ది దూరం రహదారి ఉండటంతో రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారు ఒక్కసారి డౌన్ రావడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తేనే కానీ ఈ సమస్యలకు దొరికదని స్థానికులు చెప్పుకుంటున్నారు.